# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక

శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా
ఫోన్ (0863) 2293645, 2293862, 2293206.
web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com

సంపాదక వర్గము
డి.జె. బాలకృష్ణ లాల్
మిస్. పి. ఇందిరాదేవి
డా॥ యమ్. స్వర్ణముఖి

సంపుటి 37 సంచిక 8
పేజీలు 44
ఏప్రిల్ 2018

5సం॥ల చందా రూ. 250
2సం॥ల చందా రూ. 120
సంవత్సర చందా రూ. 60
విడిప్రతి వెల...... రూ. 5

బ్యాంక్ డ్రాఫ్టు Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్ , A/C సమర్థ సద్గురు ,పేరుతో డ్రా చేయండి.
M.O, బ్యాంక్ డ్రాఫ్టు పంపవలసిన చిరునామా
మేనేజరు
సమర్థ సద్గురు మాగజైన్
శ్రీకాళీగార్డెన్స్ - 522508, నంబూరు
గుంటూరు జిల్లా

printed and published by C.V. Ramana Babu on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh and Published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, Editor DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL

**ఈ సంచికలో** ............................ ....... **పేజీ**

భద్రవాక్యం ....................................4
శ్రీబాబూజీ ఉవాచ.................................... 6
సత్యకాముడు ....................................8
అమ్మమాట.................................... 10
జీవన్ముక్తి ....................................12
బొమ్మల కొలువు. ....... ...... ................... 14
త్రిపురా రహస్యం .................................... 16
పరమాత్ముని శరణాగతి ..... .................. ....18
త్యాగ మహిమ .............................. ...............21
శివుని కథలు .................................... ..23
సాధన చతుష్టయం ....................................25
యోగవాశిష్ఠము .................................... 27
శ్రీకాళీగార్డెన్స్ కార్యక్రమాలు.............................29
పరిప్రశ్న .................................... ..30
కెరటాలకు తల వంచితే తరగదు త్రోవ ............................34
జెన్ స్టోరీ ... .... ...... ....................................35
కైవల్యోపనిషత్ ... ....................................36
సమర్థ సద్గురునాధుని దివ్యచరిత్ర.....39
విష్ణు కథలు ....... ............................ ...............41

# భద్ర వాక్యం

- పరాశర ప్రసాద్

అణోరణీయా సహమేవ తద్వన్మహానహం విశ్వమహం విచిత్రమ్ ।
పురాతనోహం పురుషోహమీశో ! హిర్మణయోహం శివరూపమస్మి ॥
(కైవల్యోపనిషత్)

నిరాకారమైన ఆత్మ తత్త్వాన్ని సద్గురుమూర్తి శిష్యునికి తెలియజేయటమే ఆయన ధ్యేయం. ఆయన తెలియజేసే ఆత్మతత్త్వం కేవలం ఆయన అనుభూతి. ఆత్మవస్తువు అణువుకంటె అణువు, మరియు మహత్తు కంటె మహత్తు. దీనిని అర్థం చేసుకోవటానికి సోదాహరణంగా విశదీకరించవలసి వస్తుంది.

సర్వవ్యాపకమైన ఆకాశము సూక్ష్మాతి సుక్ష్మమైన వెంట్రుకలోనూ ఉన్నది. అంతేకాదు విశ్వమంతా వ్యాప్తమై అన్నిరూపాలకు స్థావరమైన మహాకాశములోనూ ఉంది. అయితే సాధకుడు ధ్యాననిష్ఠలో మనస్సు నిశ్చలమై బుద్ధి వివేకవంతమైనప్పుడు భావనలు, ఆలోచనలు, సంకల్పాలు అదృశ్యమై మూడు అవస్థలకు సాక్షియై ఆత్మసాక్షాత్కారంలో తానే మిగిలి పోతాడు.

సాధకులు ఇంకొక విషయాన్ని గుర్తించాలి. ఆత్మ తత్త్వం అనేది ఎవరైనా కొత్తగా కనుగొన్నారా? ఎన్నడూ కాదు. అది అతి పురాతనమైనది. మానవుడు అన్వేషణ ద్వారా నిగూఢమైన, యదార్థమైన విషయాన్ని తన విజ్ఞానం చేత గుర్తించగలుగుతున్నాడు. అలాగే ఆత్మ తత్త్వం కేవలం సద్గురుమూర్తి అనుగ్రహంతోనే సాక్షాత్కరింపజేసుకోగలరు. అది అతి పురాతనమైనది. అది మనకందరకూ అత్యంత సన్నిహితమైనది. ఎందువలనంటే ఆత్మలేక చైతన్యమే మనం ప్రతిక్షణం పొందే అనుభూతులకు ఆధారము. అంతేకాదు అది మనలోని అంతర్గతంగా ఉన్న జీవశక్తి. ఆ శక్తి లేనిదే దేహం ఇంద్రియాలు, మనోబుద్ధులు శక్తిహీనమే కదా!

స్థూల సూక్ష్మ రూపంలో జడమై వున్న సర్వప్రకృతిని సచేతనంగా చేసి నడిపించే ఆ చైతన్యమునే పురుషుడు అంటారు. పురుషుడు అంటే అధికారి లేక పాలకుడు లేక యజమాని. ఏ నామంతో సంబోధించినా ఆ శక్తి ప్రమేయం లేకుండా ఏ ఒక్క పనీ, ఏ అనుభవమూ సాధ్యం కాదు. కేవలం క్రియకు దోహదం చేయటమే కాదు. క్రియకు ఆధారమైన

దానిని గుర్తించగలుగుతున్నారు కాబట్టి అది ప్రకాశము, లేక తేజస్సు. అది స్వయం ప్రకాశము.

ఆత్మానుభూతిలో మనస్సు లయమైంది కాబట్టి అక్కడ విక్షేపాలకు, సుఖదుఃఖాలకు, రాగద్వేషాలకు స్థానము లేదు. అందువల్ల అది శివము, లేదా మంగళకరము. మనకందరికీ సన్నిహితమైన 'తాను'ని గుర్తించాలంటే అడ్డుగా వున్న అజ్ఞానమనే తెర తొలగాలి. దేహేంద్రియాదులు, మనోబుద్ధుల ఆలోచనలు, సంకల్పాలు, క్రియలే ఆ అజ్ఞానమనే తెరగా గుర్తించాలి.

## శ్రద్ధాంజలి

శ్రీబాబూజీ చిరకాల భక్తులు, ఆశ్రమ స్థిర నివాసులు అయిన శ్రీ బులుసు కామేశ్వరరావుగారు 20-3-2018 మంగళవారం నాడు శ్రీ సద్గురు సాయుజ్యం పొందారు. వీరి వయస్సు 78 సంవత్సరాలు. సద్గురు దేవులు వీరి ఆత్మకు శాంతిని ప్రసాదించెదరు గాక!

వీరి కుటుంబ సభ్యులకు, బంధు మిత్రులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాము.

## పెదనింద్రకొలను శాఖలో కార్యక్రమాలు

ఏప్రియల్ 2018

10 మంగళ - శ్రీగురుదశమి. రాత్రి 7గం.లకు శ్రీసద్గురుపాద పూజ.

20 శుక్ర - శ్రీ శంకరజయంతి

29 ఆది - వైశాఖపూర్ణిమ. ఉదయం. 11గం. శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన.

మే 2018

10 గురువారం -శ్రీగురుదశమి- హనుమజ్జయంతి - ఉదయం 10గం.లకు ఆకుపూజ; శ్రీ సద్గురు పాద పూజ, భక్త సమారాధన.

29 మంగళవారం - అధిక జేష్ఠ పూర్ణిమ - రాత్రి 7గం. శ్రీసద్గురుపాదపూజ

# శ్రీబాబూజీ ఉవాచ

- పరాశర ప్రసాద్

27-12-79

మేమంతా స్వామి దర్శనార్థం కూర్చున్నాము. Idleman's brain is devil's workshop అన్నట్లు మాలో మేము చర్చ ప్రారంభించాము. ఆధ్యాత్మిక విద్య ఎంత అవసరవెూ ప్రకృతి సంబంధమైన అధ్యయనం కూడా అంతే అవసరము కదా? ఉదాహరణకు మానవుని శారీరక సంబంధమైన విషయాలు అధ్యయనం చేయబట్టేకదా! మానవునికి సంభవించే వ్యాధుల నివారణ గూర్చి తెలిసేది. అలాగే ఇతర విజ్ఞానశాస్త్ర పరిశోధనలు కూడ అవసరమే అన్న విషయము ప్రస్తావనకి వచ్చింది. అంతవరకూ బాగానే ఉంది.



మానవుడు ఈ విధంగా విచారణ చేయగా చేయగా వీటన్నింటికి అతీతమైన శక్తి గురించి తెలుసుకొని అపుడు ఆధ్యాత్మిక చింతన ప్రారంభిస్తాడు. కాబట్టి ప్రకృతి సంబంధమైన విషయాల మీద విచారణ చేయుట మంచిదే అన్నట్లు వచ్చింది సంభాషణ.

ఇంతలో శ్రీ బాబు వచ్చారు. “మీరు ఏదో చర్చిస్తున్నారు. ఏమిటి?” అని అడిగారు.

మేము చర్చించే విషయాన్ని మా ద్వారా విన్న తర్వాత “అటువంటి ఆలోచనా విధానం తప్పు. సాధకుడి మనస్సు ఎప్పుడూ లక్ష్యార్థము మీదనే కేంద్రీకరించాలి గానీ, మరి ఏ ఇతర విషయాల మీదికి పోరాదు. గురుబోధని శ్రద్ధగా వినాలి. అలా శ్రవణం చేసిన దానిని ధ్యానం ద్వారా మననం చేసుకోవాలి. చూడండి చేనువద్ద కట్టబడిన ఆవు కట్టుని త్రెంచుకొని చేనులోపడి వేరొక దృష్టి లేకుండా తొందరగా

మేసి తృప్తిచెందిన పిమ్మట విశ్రమించి దానిని నెమరువేస్తుంది. అదే దానికి పుష్టినిస్తుంది.

శ్రవణము, మననము ద్వారా భూత వర్తమాన కాలములందు ఈ దేహము ద్వారా ఆర్జించిన వాసనలన్నీ హరింపబడతాయి. శ్రవణము భూతకాల విషయము, మననము వర్తమాన విషయముగా నుండుటచేత శ్రవణ మననముల ద్వారా భూత వర్తమాన కాలములలో ఆర్జించిన దేహవాసనలు హరింపబడతాయి" అని ఉద్బోధించారు శ్రీ బాబూజీ.

## ప్రారంభోత్సవ ఆహ్వానము

### కె.వి.వి కన్వెంషన్ హాల్

11-5-2018 రాత్రి గం.2-46 ని॥లకు

అనగా (తెల్లవారితే 12-5-2018) శ్రీమాతాజీవారిచే ప్రారంభోత్సవం!

12వ తారీఖున ఉదయం శ్రీసీతా రాముల కళ్యాణం మరియు సాయంత్రం 6గం.లకు సత్సంగ సమావేశము జరుగును.

గణపవరం ః గణపవరం - పిప్పర్రు మెయిన్ రోడ్.

ప్రొప్రైటర్ ః గోలి వీర వెంకట సత్య సూరి శ్రీనివాసరావు

వివరములకు ః శ్రీనివాసరావు - 99488 34999

సుబ్బరాజు - 94403 77399

### అంబాజీపేటలో పూజ్యశ్రీ మాతాజీవారి సత్సంగ సమావేశములు

ఏప్రిల్ ది. 21, 22, 23 తేదీలలో

బొండాడ సురేంద్ర బాబురావు గారి గృహమునందు - ఉదయం

శ్రీవాసవి కన్యకా పరమేశ్వరీ ఆలయ ప్రాంగణం - సాయంత్రం కార్యక్రమాలు జరుగును

అందరూ ఆహ్వానితులే!

వివరములకు -బొండాడ శివ ప్రసాద్................ 94401 48472

అత్యం సత్యనారాయణమూర్తి....... 92916 98387

అప్పన రాజా ........... 99514 12121

# సత్యకాముడు

నది పడమటి తీరాన అడవి పొదల్లో సూర్యుడు అస్తమించాడు. ఆశ్రమ బాలురు ఆవులను ఇంటికి తోలుకుని తిరిగివచ్చి గౌతమ గురువు చుట్టూ కూర్చుని వున్నారు. అగ్నిహోత్రం ముందు ఒక కొత్త బాలుడు వచ్చి, పుష్ప ఫలాదులను సమర్పించి, గౌతమ మహర్షి పాదాలకు నమస్కరించాడు.

'అంతిమ సత్యాన్ని అందుకునే మార్గంలో నన్ను ప్రవేశపెడతారనే కోర్కెతో వచ్చాను. నా పేరు సత్యకాముడు' అన్నాడు.

'నీకు నా ఆశీస్సులు! వత్సా! నీవే జాతివాడివి? బ్రహ్మవిద్యకు ఒక్క బ్రాహ్మణులే అర్హులు' అన్నాడు గౌతముడు.

'నా వర్ణమేమిటో నాకు తెలియదు. మా అమ్మని అడిగి వస్తాను' అని చెప్పి వెళ్ళాడు సత్యకాముడు.

లోతులేని ఏరును దాటి, నిద్రపోతున్న పల్లెపంచన ఇసుకపర్ర చివర వున్న తల్లి కుటీరాన్ని చేరుకున్నాడు. గదిలో దీపం మసకగా వెలుగుతోంది. కుమారుడి రాకకై ఎదురు చూస్తూ తలుపు దగ్గర చీకట్లో నిల్చున్నది తల్లి. అతన్ని కౌగిలించుకుని, శిరస్సున ముద్దు పెట్టుకొని ఆ తల్లి ప్రేమతో 'గురువు దగ్గరకు వెళ్ళిన పని ఏమైంది?' అని అడిగింది.

'అమ్మా! నా తండ్రి ఎవరు? ఆధ్యాత్మిక విద్యకు ఒక్క బ్రాహ్మణులే అర్హులని గౌతములు శెలవిచ్చారు' అన్నాడు.

'కళ్ళు క్రిందకు వాల్చి, వినీ వినిపించని మాటలతో ఆ తల్లి 'నా యవ్వనంలో నేను పరమ దరిద్రురాలిని. నాకు ఎందరో నాధులు. భర్త లేని నీ తల్లి జాబాలి చేతుల్లోకి నువ్వు వచ్చావు' అని సమాధానం చెప్పింది.

ఆ అరణ్యాశ్రమ లేత ఎండ కిరణాలు మెరుస్తున్నాయి. ఉదయాన్నే స్నానాలు చేసి, ఇంకా తడిగా వేళ్ళాడుతున్న జుట్టుతో శిష్యులు గురువు చుట్టూ కూర్చుని ఉన్నారు ఓ వృక్షం క్రింద.

సత్యకాముడు వచ్చి, ఋషి పాదాలకు వొంగి నమస్కరించి మాట్లాడకుండా నిల్చున్నాడు.

'ఏ జాతి వాడవో తెలుసుకుని వచ్చావా?' అని అడిగాడా మహర్షి. "గురుదేవా! నాకు తెలియదు. మా అమ్మ - 'నా యవ్వనంలో

అనేక ప్రియుల్ని సేవించాను. భర్త లేని నీ తల్లి జాబాలి చేతుల్లోకి నువ్వు వచ్చావు' అని నాతో చెప్పింది" అన్నాడు సత్యకాముడు వినయంగా.

తుట్టె కదిలిస్తే ఆగ్రహంతో లేచే తేనెటీగల ఝుంకారంలాగ, ఆ శిష్యులందరూ, కులగౌరవం లేని బహిష్కృతుడి సిగ్గుమాలిన పొగరుబోతుతనాన్ని గురించి గొణుక్కుంటున్నారు.

గురుదేవుడు గౌతమ మహర్షి వెంటనే తన ఆసనం మీద నుండి లేచి, చేతులు జాచి, ఆ బాలుడిని తన రొమ్ముకు హత్తుకున్నాడు. "ఓ బాలకా! నీవు బ్రాహ్మణులలో ఉత్తముడవి. అన్ని కులాలలోకి అగ్రమైన సత్యవంశ సంజాతుడవు వత్సా!" అని ఎంతగానో ప్రశంసించారు.

## హైదరాబాదు శాఖలో కార్యక్రమాలు

ఏప్రియల్ 2018

10 మంగళ- శ్రీగురుదశమి సా॥ 5-30 గం. శ్రీసద్గురుపాదపూజ.

29 ఆది - వైశాఖ పూర్ణిమ, బుద్ధజయంతి - ఉదయం 11గం. శ్రీసద్గురుపాదపూజ, సత్సంగం, భక్తసమారాధన.

మే 2018

10 గురువారం - శ్రీగురుదశమి(హనుమజ్జయంతి) - ఉదయం 11 గం॥లకు సత్సంగం, శ్రీసద్గురు పాదపూజ, భక్తసమారాధన.

29 మంగళ - అధిక జేష్ఠ పౌర్ణమి - సాయంత్రం 5-30ని॥ శ్రీ సద్గురు పాద పూజ, భక్తసమారాధన.

## సమర్థ సద్గురు మాస పత్రిక సభ్యులకు విజ్ఞప్తి

ఈ క్రింద తెలిపిన సభ్యుల మాస పత్రిక చందా ఏప్రియల్ 2018, మే 2018 మాసాలలో ముగుస్తుంది. పత్రిక నిలిపివేసే ముందుగా మీ సభ్యత్వాన్ని పునరుద్ధరించుకొనండి.

ఏప్రియల్ 2018 : AS 5229, 5568 నుండి 5572 వరకు, 5574, 5575, AS 5591,6274, 6509,6682,6692,7108, 7251 నుండి 7254 వరకు, 7264, 7265, 7266, 7268.

మే 2018 : AS 5604, 5626, 6712, 7069, 7125, 7274, 7468, LM 4112,4114

మేనేజరు

# అమ్మమాట

- జపమాల ప్రసాద

'సూచన మంత్రం'

అనంతమైన మన తత్త్వాన్ని గుర్తించటం కోసమే ఉత్కృష్టమైన మానవజన్మ వచ్చింది. మన జీవిత పరమార్థాన్ని గుర్తింపజేసి, మన ప్రవృత్తిలో మార్పు తెచ్చి, నివృత్తి మార్గం వైపు నడిపేది కేవలం గురుదేవుల సన్నిధి మాత్రమే. ఇంత దుర్లభమైన మానవజన్మ వచ్చి కూడా మానవులు దానిని వ్యర్థం చేసుకుంటున్నారు. నిన్ను వుద్ధరించుకోవాలంటే మానవ జన్మయే కావాలి. అంతేకాకుండా, మహాత్ముల సన్నిధి కూడా మనకు లభించింది. గురువులను ఆశ్రయించి, వారి ద్వారా మనం లక్ష్యార్థాన్ని పొందాలి. అప్పుడే మన జీవితానికి సార్థకత.



గురుదేవులు ప్రసాదించిన మహా మంత్రం ద్వారా నిన్ను నీవు మరచిపోయే స్థితికి రావాలి. గురుబోధా శ్రవణం చేయాలి. గురుమూర్తి యందు అచంచల విశ్వాసం కలిగి వుండి, వారి బోధామృతాన్ని నిరంతరం మననం చేసుకుంటూ, దానిని అనుభవానికి తెచ్చుకోవాలి. మన జీవితమే ప్రభువుకు పరిమళ భరితంగా నివేదన అయిపోవాలి. అదే నిజమైన ఆరాధన అంటే.

పరమాత్మ ఎక్కడున్నాడంటే, ఎక్కడ లేడని ప్రశ్నించుకోండి. పరమాత్మ నీలోనే వున్నాడు. నీ దేహాన్ని నీవు ప్రేమిస్తున్నావు. కాని దానికి వార్ధక్యం రాకుండా ఆపుతున్నావా? నీ శరీరం అనుక్షణం మారిపోతోంది. కానీ నీ శరీరాన్ని ప్రకాశింప జేసి, నడిపిస్తున్న వస్తువుకి మార్పులేదు. దానిని గుర్తించాలి. అందుకే గురుదేవులు మనకి తత్త్వాన్ని అనేక విధాల బోధిస్తున్నారు. శ్రద్ధ వున్నంత మాత్రాన సరిపోదు. ఏదైతే వింటున్నామో దాన్ని అనుభవానికి తెచ్చుకోవాలి.

శ్రీగురుదేవులు మనలను accept చేసి (శిష్యులగా స్వీకరించి) మనం తరించడానికి మంత్రం ఇస్తున్నారు."నువ్వు దైవమే. నీవు దేవుడి కంటే భిన్నం కాదు" అని చెబుతూ, ఇది గుర్తించటానికి నీ శ్వాసనే గుర్తించమంటున్నారు. అంటే శ్వాస మీద ధ్యాస పెట్టుకోమని కాదు. శ్వాస ద్వారా 'సోऽహమ్' (సః + అహమ్) అనే మంత్రం అజప గాయత్రిగా జరుగుతోంది. 'సోऽహమ్' అంటే 'అది నేను' అంటే ఆత్మవస్తువు, చైతన్యము ఏదయితే వుందో అది నేను గానీ ఈ మార్పులు చెందుతూ నశించి పోయే దేహం నేను కాదు అని చెప్తున్నది.

"హంసశ్శివస్సోऽహమ్" - ఇదే సూచన మంత్రం. మనం బ్రతికి వున్నంతకాలం మనం బ్రతికే వున్నామని గుర్తింపజేసే శ్వాస మనకి సూచన నిస్తోంది. ఆ దివ్యత్వాన్ని నువ్వు తెలుసుకొని, అనుభవించాలి. అంటే నీ నడవడికలో, నీ ప్రవృత్తిలో మార్పు తెచ్చుకోవాలి.

'నేను, నేను, నేను' అని ఎగిరే మేనుని దాటాలి. ఉచ్ఛ్వాస నిశ్వాసల ద్వారా ఆ ప్రభువుని గుర్తించాలి. ధ్యాన సమయంలో నువ్వు మౌనంగా వున్నప్పుడే ఆ 'సోహమ్' భావాన్ని గుర్తించగలవు. శ్రీ ఆదిశంకర భగవత్పాదులవారు తమ 'చిదానంద అష్టకం' లో వివరించారు.

అకారం ఉకారం మకారం తృతీయమ్ (తురీయమ్)
సదా నాద, బిందు, కళాతీత పూర్ణమ్
హరిబ్రహ్మ రుద్రం, పరబ్రహ్మ రూపమ్
చిదానంద రూప శ్శివోహం, శ్శివోహమ్ ॥

అకారం బ్రహ్మ రూపం, ఉకారం విష్ణురూపం, మకారం రుద్రరూపం; ఓంకారమనే ప్రణవం ఏకాక్షరంగా కనిపిస్తున్నా, దానిలో అకార ఉకార మకారాలు దాగి వున్నాయి. ఈ త్రిమూర్తులకు ఆధారమైనది సాక్షాత్తు పరబ్రహ్మ స్వరూపమైన గురు స్వరూపం. చిదానంద రూపమైన తేజోరూపం, ఆనంద రూపమైన గురుపరమాత్మే అహం శబ్దవాచ్యుడుగా 'నేను'గా ప్రకాశిస్తున్నాడు. ఆ మంగళ స్వరూపమైన శివస్వరూపమే నేను... అని నొక్కి నొక్కి చెబుతున్నారు ఆచార్యదేవులు.

–సశేషం

# జీవన్ముక్తి

(గత సంచిక తరువాయి)

- రమణ ప్రసాద్

ఆలోచిస్తే ఇవన్నీ మానవుడు కావాలని చేసినవే. సుఖ దుఃఖాలనుండి, అవిద్యనుండి, జనన మరణాదుల నుండి, స్వర్గ, నరకాదుల భయం నుండి సహజంగా విడివడటమే "జీవన్ముక్తి". అదే ద్వంద్వ రహిత స్థితి. ఆనంద స్థితి. అటువంటి దివ్యోన్మాద స్థితిలో ఓలలాడిన వారే, ఒడియాబాబా, రామకృష్ణ పరమహంస, రమణ మహర్షి మొదలైన మహాత్ములు. వారు ఈ యుగం వారే. ఎంతోమంది మహాత్ములు వ్యక్తంగా, అవ్యక్తంగా జీమన్ముక్త స్థితిని వారు పొంది మానవాళి అట్టి స్థితిని పొందే మార్గాన్ని ప్రబోధిస్తున్నారు. అట్టి శాశ్వతానందం ఎలా లభిస్తుంది?



గాఢనిద్రలో మన మనస్సు అణిగి ఉండి ప్రపంచం దృష్టి ఉండదు. ఇంద్రియాలు అణిగి వుంటాయి. అందువలన మనం నిద్రలో ఆనందం పొందుతాం. "నేను హాయిగ నిద్ర పోయానని" నిద్ర లేచాక చెప్పగలుగుతాం. అదే విధంగా జాగ్రదావస్థలో మానసికంగా, శారీరికంగా బాహ్య ప్రపంచం నుండి బయటకు వస్తే మనకు అట్టి ఆనందం లభిస్తుంది. ఒక సువాసనలను వెదజల్లే గులాబీ పుష్పాన్ని చూడగానే ఆనందంతో స్పందిస్తాడు. ఆ ఆనందం పుష్పం ఇచ్చిందా? లేదు. ఆ విరబూసిన పుష్పాన్ని చూడగానే నీలో దాగి వున్న ఆనందం పెల్లుబికింది. ప్రకృతిలోని అందాలు, దివ్యమైన వస్తువులు చూడగానే కళ్లలో మెరిసే కాంతి, ఆనందం నీకు ఆ వస్తువులు తెచ్చి పెట్టలేదు. అవి నీలోనే దాగి ఉండి ఆ వస్తువులను చూడగానే నీలోనుంచి ఆనందం వెల్లి విరుస్తుంది. ఏదైనా మధుర పదార్థం యొక్కరుచి, పుష్ప సుగంధం, వేణుగానం లోని మధురత్వం మెత్తటి పచ్చిక స్పర్శ - వీటి వల్ల లభించే సుఖం, ఆనందం శబ్ద, స్పర్శ,రూప, రస, గంధాలద్వారా పొందుతున్నాం.

ఆలోచిస్తే ఈ శబ్ద, స్పర్శ, రూప, రస, గంధాలు, బాహ్యవిషయాదులు, బంధు మిత్రులు, వ్యక్తిత్వాలు కల్పితాలే. వీటి వల్ల ఆనందం వస్తోంది అనుకోవటం కేవలం భ్రమ. దివ్యానందమనే నిధి మనలో నిక్షిప్తమై ఉంది. అజ్ఞానం వల్ల అది గ్రహించలేక బంధం తెచ్చుకుంటున్నాం. భయ దుఃఖాలకు లోనవుతున్నాం. వీటి నుంచి బయటపడటమే "జీవన్ముక్తి". జీవన్ముక్తుడికి అంతటా ఆనందమే! బాహ్య విషయాదులు అతడిని బంధింపవు. ఆత్మానందం

ఆతడిలో సహజంగా ప్రకాశిస్తుంది. ఆనందం అతడి సొత్తు. శ్రద్ధ, ఆసక్తి, అకుంఠిత దీక్ష ఉన్న సాధుకుడు ఆ స్థితిని పొందగలుగుతాడు.

అజ్ఞానాన్ని తొలగించుకోవటం ఎలా? - అజ్ఞానం వల్ల నాలుగు అపోహలు మనకి కలుగుతాయి. 1) మనం చూసేదంతా నిజమనుకోవటం;2) మనం చూసినదే నిత్యం అనుకోవటం;3) బాహ్య విషయాల వల్లనే ఆనందం కలుగుతోంది అనుకోవటం;4) ఇదే ఆత్మానందం అనుకోవటం. మన నిజ తత్త్వాన్ని గుర్తించక పోవటమే ఈ అజ్ఞానానికి కారణం. మనం ఆత్మ స్వరూపులం. నిత్య, శుద్ధ, బుద్ధ, పరమాత్మ స్వరూపులం. ఈ నాలుగు అపోహలను వివేకంతో విచారణతో తొలగించుకున్నప్పుడే మన నిజ తత్త్వం గోచరమవుతుంది. జీమన్ముక్త స్థితి లభిస్తుంది.

జీవన్ముక్తికి ఆచరణ మార్గం - జీవన్ముక్తి - ఇది జీవనకళ, జీవన సరళి. దైనందిక జీవితంలో ఈ విధానాన్ని అవలంబించవచ్చు. సూక్ష్మ బుద్ధి, ఏకాగ్రత. జాగరూకత - ఇవి దివ్యానందాన్ని పొందటానికి తోడ్పడతాయి. అది మనజన్మహక్కు.. జీవించి ఉండగానే పొందాలి. ఆత్మ శక్తి మన జ్ఞానేంద్రియాల ద్వారా, కర్మేంద్రియాల ద్వారా చేసే పనుల ద్వారా ప్రకాశిస్తోంది. దానిని గుర్తించాలి. అప్పుడే మన జీవితానికి సార్థకత. శాస్త్రాలలో, వేదాలలో నిర్వచింపబడిన ఈ విధానాన్ని ఆచరిస్తే నీవెవరో నీవు తెలుసుకుంటావు. మన ప్రవర్తనలో,మాటలలో,సంజ్ఞలలో, మనంచేసే ప్రతి పని ఆత్మ శక్తి సత్తా వల్లనే జరుగుతుంది. అట్టి వ్యక్తి వదనంలో ప్రశాంతత, ప్రసన్నత,ఆనందం ఉట్టి పడుతుంది. అదే ఆత్మానందం, లేక చైతన్యం. ఆ శక్తికి అవధులు లేవు. అతడు అజ్ఞానపు చీకట్లు తొలగి, దివ్య కాంతులతో ప్రకాశిస్తూ ఉంటాడు. దివ్యానందం, విజ్ఞానం, యౌవ్వనం, అందం, ఆనందం, గీతం, సంగీతం, మధురత్వం, నీలోంచి వచ్చినవే. అదినువ్వే. సూర్యుడిని కాంతిని విడదీయలేము. రోజా పువ్వు దాని సువాసనను విడదీయలేము. ఆ విధంగానే నీలోనుంచి ప్రస్ఫుటమయ్యే దివ్య శక్తులు నీలో ప్రకాశిస్తున్న ఆత్మశక్తివే.

" జీవన్ముక్తి" ఇప్పుడే, ఇక్కడే ఈ జన్మలోనే పొందవచ్చు. మనలో వున్న సుగుణాలను పెంపొందించుకోవాలి. "నేను - నాది" అనే బంధాలనుంచి బయట పడాలి. అజ్ఞానపు చీకటులను తొలగించుకోవాలి. మనలో ఉన్న దివ్య శక్తులను గుర్తిస్తూ , దివ్యానందానికి వారసులం కావాలి. అదే జీవన్ముక్త స్థితి. దానిని బ్రతికి ఉండగానే పొందాలి. అది మన జన్మ హక్కు. జీవన్ముక్తిని పొందటమే మానవ జన్మకి సార్థకత.

# బొమ్మల కొలువు

- రమణ ప్రసాద్

(శ్రీ మాతాజీవారి ప్రసంగాల నుండి)

శ్రీ కృష్ణా! నీ పేరెంతో మధురమురా । అది ఏమి చిత్రమో ఎంత జుర్రినా తీరదేమిరా కృష్ణా । తనివి తీరదేమిరా కృష్ణా! .........

భగవన్నామం ఎంతో మధురం. పంచదార చిలకను ఎక్కడ కొరికినా మాధుర్యమే కదా! ఆ మాధుర్యం దొరకాలే గాని దొరికితే అందులోనుంచి బయటకి రాలేము. మన హృదయ సింహాసనంలో స్థితుడైన బాబు మనకు వేరు కాదు. మనం వారికి వేరు కాదు. వారు ఎన్నెన్నో అవతారాలు ఎత్తుతూ మానవకోటిని ఉద్ధరించటానికి కంకణం కట్టుకున్నారు. ఈ అవతారంలో మనందరిని సన్మార్గంలో నడిపించిన బాబు ఇప్పుడూ వారు మన మధ్యనే ఉన్నారు. ఆ గుర్తింపు రావాలి.

పూజ మొదలవనంతవరకు అది బొమ్మ. దానికి ప్రాణ ప్రతిష్ట చేసిన తరువాత అది బ్రహ్మ. శ్రద్ధతో షోడశోపచారాలతో ఆదేవుడిని పూజిస్తే ఆయన తప్పక అనుగ్రహిస్తాడు. ప్రభూ! నీవే సృష్టి కర్తవు, భర్తవు, ధర్తవు అని స్థిర చిత్తంతో కొలిచినవారికి భగవత్సాక్షాత్కారం తప్పక లభిస్తుంది. భగవంతుడిని ముందుగా ధ్యానం చేసి, “ఆవాహయామి” అంటే వస్తాడు. “ ఆసనం సమర్పయామి” అంటే వచ్చి ఆసనం గ్రహిస్తాడు. తరవాత పాద ప్రక్షాళనకు తన పాదాలను అందిస్తాడు. ఆ పవిత్ర జలాలను మనం శిరస్సుపైన ప్రోక్షించుకుంటాము. వారి చేతులు నీటితో కడిగి, సేద తీరటానికి మంచినీరు స్వీకరించమని వేడుకొంటాం. మనసారా స్వామిని అభిషేకించి, దివ్యపుష్పమాలలతో అలంకరించి పూజ చేసుకుంటాం. ధూప దీప నైవేద్యాదులు సమర్పించుకొని స్వామికి సాష్టాంగ నమస్కారం చేసి వారి చూపులో చూపు నిలిపితే వారు దయతో రక్ష పెట్టి అభయముద్రతో దీవిస్తారు. అప్పుడు కలిగే అనుభవం ఏది? “స్వామి, నీవు, జగము అంతా ఒకటై అంతా భగవన్మయం అవుతుంది. ఈ సృష్టి అంతా వారిదే అయినప్పుడు. నువ్వు పూజ చేసే పువ్వులు ఆసృష్టిలోనివే కదా! మనస్సు ప్రధానం. ఇలా మనస్సు పెట్టి చేసిన పూజ నువ్వు ఎక్కడైనా, ఎప్పుడైనా చేసుకోవచ్చు.

మన ఆశ్రమంలోనివారు బొమ్మలకొలువు పెట్టారు. అవి నాకు సెల్‌ఫోన్‌లో చూపించారు. ఈ సృష్టి భగవంతుడు ఏర్పర్చిన బొమ్మలకొలువు. ఈ సృష్టికార్యానికి మహానారాయణుడు ఒక బ్రహ్మను సృష్టించాడు. మనమంతా ఆ బ్రహ్మ సృష్టించిన బొమ్మలం. ఇప్పుడు

మనముందున్న ఈ బొమ్మలకు గూళ్లు కూడా ప్రసాదించాడు. కాబట్టి అవి సాయంత్రానికి తమ తమ గూళ్ళకి వెళ్ళిపోతాయి. ఆ బొమ్మల కొలువులో మనస్వామిని పెట్టుకున్నాం.

"నువ్వెవరయ్యా? నేనెవరయ్యా! నువ్వు నేను ఒకటేనయ్యా! నువ్వే నేనని, నేనే నీవని నమ్మినదాసిని (నమ్మినవాడిని) నేనయ్యా। ........."

ఈ పాట స్వామి సన్నిధిలో పాడటం జరిగింది. శ్రీగురుదేవులు శ్రీ విజయేశ్వరానందగారిని ఆ పాటకి అర్థం చెప్పమన్నారు. నమ్మినదాసి ఎవరో తెలియకవారు సందిగ్ధంలో పడ్డారు. ఈ పాట గోరాకుంభారుడు విఠలుని కీరిస్తూ పాడిన సన్నివేశం ఆ సన్నివేశం గుర్తు చేయాల్సి వచ్చింది. ఆతరువాత శ్రీబాబు నన్ను పిలిచి ఆపాటలో ఉన్నట్లుగా పాడచ్చుకదా. దానిలో స్త్రీత్వం చేర్చాలా? అన్నారు. గోరా కుంభారుడు - "జీవనోపాధికై కుండలు చేసే కుమ్మరిని నేనైతే , నువ్వు జీవంపోసే బొమ్మలు చేస్తావు ప్రభూ! నాకు యాగాలు, యోగాలు ఏవీ తెలయవు. నాకు భోగాలపట్ల ఆసక్తి లేదు. ఎప్పుడూ నీ నామామృతాన్ని ఆస్వాదన చేసే వరం ప్రసాదించు ప్రభూ!" అని పాండురంగడిని వేడుకున్నాడు.

ఇప్పుడు మనం బలి చక్రవర్తి గురించి విన్నాం. అది కథకాదు. నిత్య సత్యం. గురుసోదరులు శ్రీ వెంకటరమణప్రసాద్‌గారు "బలి చక్రవర్తి నిమ్మకాయ నిలబెట్టగల మీసాలతో ఠీవిగా కూర్చుని ఉన్నాడ"ని బాబు చెప్పేవార"ని చెప్పినప్పుడు మనమంతా బలిచక్రవర్తి రూపాన్ని ఊహించుకోలేదూ!

రవిబింబంబుపమింపఁ బాత్రమగు ఛత్రంబై శిరోరత్నమై
శ్రవణాలంకృతమై గళాభరణమై సౌవర్ణకేయూరమై
ఛవిమత్కంకణమై కటిస్థలినుదంచద్ఘంటియై నూపుర
ప్రవరంబై పదపీఠమై వటుడు దా బ్రహ్మాండమున్ నిండుచోన్॥

'దానం స్వీకరించిన వామనుడు పెరిగి ఇంతచిన్నవాడింతవాడై. మరింతవాడై, మేఘమండలాన్ని దాటి చంద్రుని కంతఅయి మహర్లోక,సత్యలోకాలనుదాటినవాడై బ్రహ్మాండమంతానిండిన ఆ వామనుడిని సూర్యబింబంతో పోలుస్తూ, ఆ పెరిగిపోతున్న ఆవామనమూర్తికి సూర్యబింబం మొదట ఛత్రముగా,తదుపరి కంఠాభరణంగా, ఆ పైన భుజకీర్తులుగాను, పిదప కంకణంగాను, మొలలోని గంటగాను, కాలి అందెగాను, చివరికి పాదపీఠంగా కనిపించింద"ని వర్ణించారు.

( తరువాయి భాగం 24వ పేజీలో చూడండి )

# త్రిపురా రహస్యం

(గత సంచిక తరువాయి)

- రమణ ప్రసాద్

## జ్ఞాన ఖండం

### 17వ అధ్యాయం

అష్టావక్రుడు - వ్యవహార దశలో సూక్ష్మ సమాధి ఎలా ఉంటుందో వివరించండి.

జనకుడు -1. ప్రియురాలు మొదటిసారిగా పురుషుని ఆలింగనం చేసినప్పుడు అతనికి బాహ్య దేశకాల స్థితులు, మనస్సులో సుఖంగాని, దుఃఖంగాని ఏవీ ఉండవు;.2. ఒకడు చాలా కాలంనుండి ఒక వస్తువును కోరుకుంటున్నాడు అది అకస్మాత్తుగా దొరికింది; 3. ఒకడు అడవిలో వెళ్తుండగా ఒక పెద్దపులిని చూసి స్థంభించిపోయాడు; - అదే సూక్ష్మ సమాధి స్థితి. అష్టావక్రా! సమాధి స్వరూపం తెలిసినవారు, ప్రతి క్షణం సమాధిని గుర్తించగలరు. అన్ని సంశయాలనూతొలగించే పరమ రహస్యం చెబుతున్నాను - అజ్ఞానం వల్ల ఆ సంసారం సాగుతోంది. ఇది స్వప్నం లాంటిదే. జ్ఞానం వల్లనే ఇది నశిస్తుంది. "సోహమ్" అతడు నేనే, అనే గుర్తింపుతో కలిగే విజ్ఞానమే అజ్ఞానాన్ని పూర్తిగా రూపుమాపుతుంది.



వైరాగ్యం, ముముక్షుత్వం, మొదలైన జ్ఞాన సంపద కలవాడికి వేదాంత శ్రవణం వల్ల పరోక్షజ్ఞానం కలుగుతుంది. ఇంత వరకు నేను "దేహాన్ని" అని తలచేవాడికి,"నేను దేహాన్ని కాదు" అనే విపరీత భావన వల్ల తొలిగిపోతుంది. శుద్ధ ప్రత్యగాత్మ భావం కలుగుతుంది. తరువాత శాస్త్ర ప్రమాణం వల్ల పరమాత్మ, ప్రత్యగాత్మలు ఒకటే అనే అఖండాకార జ్ఞానం కలుగుతుంది. అదే"సోఽహం" రూప జ్ఞానం.

ప్రశ్న: ఈ జ్ఞానంలో కూడా సః, అహం అని రెండు అంశలు ఉన్నాయి కదా, మరి ఇది అద్వైత జ్ఞానం ఎలా అవుతుంది?

సమాధానం -రాముడు సోముడిని పూర్వం కాశీలో చూశాడు. కొంత కాలమైంది. సోముడు రాముడుండే ఊరికి వచ్చాడు. రాముని మిత్రుడు "ఇతడెవరు? అని అడిగాడు. "కాశీలో ఉండే సోముడే ఇతడు" అని చెప్పాడు. కాబట్టి ఇక్కడ ప్రశ్నకు, సమాధానానికి విషయమైన సోముడు ఒక్కడే. అలాగే సోఽహం అన్నప్పుడు, సః శబ్దానికి, అహం శబ్దానికి విషయమైనది అఖండచితి మాత్రమే.

పూర్ణాత్మ జ్ఞానం రెండు విధాలు- పరోక్షం, అపరోక్షం. గురూపదేశం, శాస్త్ర పఠనం వల్ల కలిగే జ్ఞానం పరోక్షం. దీనివలన మోక్షం సాక్షాత్తుగా కలుగదు. దీర్ఘకాల సమాధుల వలన పరిపక్వం పొందిన విజ్ఞానం అపరోక్షజ్ఞానం.

జనకుడు - ఇప్పుడు నీకు మోక్ష ప్రాప్తి క్రమాన్ని గురించి చెబుతాను. అనేకజన్మల పుణ్యం వలన, సత్సాంగత్యం వలన, మహాత్ముల బోధా శ్రవణం వలన పరదేవతపైన భక్తి కలుగుతుంది. భక్తితో ఆమెను ఆరాధిస్తే నిత్యానిత్య వివేకం కలుగుతుంది. దాని వలన భోగాలయందు వైరాగ్యం కలుగుతుంది. ఆ తరువాత శ్రేయ సాధనాలపై శ్రద్ధ కలుగుతుంది. "నా చిత్తాన్ని ఈ రూపంలోనే ఉంచుతాను" అనే పట్టుదల ఉండాలి. చిత్తాన్ని నిరోధం చేసి ఆ రూపమందే లగ్నం చేయాలి. ప్రాణాయామ, ప్రత్యాహార సాధనలతో మనసును వశం చేసికోవాలి. అపరోక్ష జ్ఞానం కలిగే వరకు ఈ ప్రయత్నాన్ని కొనసాగించాలి. అప్పుడు "సోఽహం" - ఆ పరదేవతయే "నేను"అనే విజ్ఞానం కలుగుతుంది. మనోవ్యాపారాలను వదిలేస్తే వికల్పం పోతుంది. వికల్పం పోతే నిర్వికల్పం దానంతట అదే సిద్ధిస్తుంది.

-సశేషం

## శ్రద్ధాంజలి

శ్రీబాబూజీ చిరకాల భక్తులు, ఆశ్రమ స్థిర నివాసులు అయిన శ్రీమతి గూడూరి కాళీమాత 28-2-2018 బుధవారం నాడు శ్రీ సద్గురు సాయుజ్యం పొందారు. వీరి వయస్సు 73 సంవత్సరాలు. సద్గురు దేవులు వీరి ఆత్మకు శాంతిని ప్రసాదించెదరు గాక!

వీరి కుటుంబ సభ్యులకు, బంధు మిత్రులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాము.

# పరమాత్ముని శరణాగతి

- గాలి జగదీశ్

కాశ్మీర దేశంలో రామనాధుడనే 'తర్కరత్న' బిరుదుగల న్యాయ పండితుడుండేవాడు. ఆయన సంస్కృతంలో రెండు పెద్దపెద్ద గ్రంథాలు రచించాడు. విద్వాంసులే ఆ గ్రంథాలు చదివి చాలా ప్రభావితులయ్యారు.

ఆయన జీవితం చాలా సాదాసీదాగా జరిగేది. ఆయన భార్య గొప్ప సాధ్వి. ఆయనకి ఒక చాప , రెండుజతల బట్టలు, కొన్ని పుస్తకాలు, ఒక కలము ఉండేవి. వారు ఎవరినీ ఏదీ అడగటం గానీ, ఉచితంగా తీసుకోవటంగానీ, తినడంగానీ వుండేది కాదు.

ఆయన భార్య అడవి నుండి ముడితాడు తీసుకుని వచ్చేది. దానిని అమ్మి భోజనానికి సరిపడ సరుకులు కొనుక్కుని తీసుకువచ్చేది. వంటచేసి, ఇల్లు శుభ్రం చేసి, భర్తకు సేవచేస్తూ, భర్తకు భోజనం వడ్డించి, మిగిలిన అన్నం తాను తిని సంతృప్తిగా వుండేది. ఆ పండితుడు భగవన్నామ స్మరణలోను, ఆధ్యయనంలోను, వ్రాతపనిలోను లీనమై వుండేవాడు. అతనికి ఇంట్లో కావలసిన భోజన సామాగ్రి , బియ్యం, పప్పు వున్నాయా లేవా అనే ధ్యాస కూడా వుండేదికాదు. భార్య యింటిని ఎలా నడుపుతోంది, ఎలా సర్దుతోంది అని కూడా అడిగేవాడు కాదు. 'ఇంటి విషయాలు ఇల్లాలికే తెలుసు' అన్నట్లుగా వుండేవాడు.

ఆ భార్య కూడా భర్త సేవలో ఇంతగా కష్టపడినా కూడా ఎంతో తృప్తిగా వుండేది. సేవచేసే భాగ్యం దొరికింది, ఇంకొకరిచేత చేయించు కోవటం లేదుకదా అని సంతోషపడేది. ఇంటువంటి భార్యాభర్తలున్న భారత దేశంలో ఆధ్యాత్మిక శక్తి ఎంత సమృద్ధిగా వున్నదో కదా!

ఆ పండితుడు వ్రాసిన నాలుగు గ్రంథాలు సంస్కృత లోకంలో గొప్ప గ్రంథములు. కొద్ది రోజులలో ఆ పండితుని కీర్తి ప్రతిష్ఠలు పెరిగాయి. ఇతర దేశాల విద్వాంసులు కూడా కాశ్మీర దేశానికి వచ్చి "రాజా! దేశంలో ధర్మాత్ములు. పండితులు దుఖిస్తుంటే ఆ రాజుకు పాపం అంటుతుంది. మీ రాజ్యంలో తినడానికి తిండిలేని అటువంటి పండితుడు వున్నాడు. మీరు ఆయనను గురించి ఏమీ పట్టించుకోరా?" అని అడిగారు.

అప్పుడు ఆ రాజు ఆ పండితుడు ఎవరో ఏమిటో వివరాలు తెలుసుకుని, స్వయంగా ఆయన గుడిసెకు బయలుదేరి వెళ్ళి, చేతులు

జోడించి, "స్వామీ! మీకేమీ లోటు లేదుకదా!" అని అడిగాడు. అప్పుడు ఆ పండితుడు "రాజా! నేను నాలుగు గ్రంథాలు రచించాను. వాటిలో నాకే లోటూ కనబడ లేదు. మీరు అవి చదివి వాటిల్లో ఏమైనా లోటు పొట్లుంటే నాకు తెలియజేయండి" అన్నాడు.

రాజు "స్వామీ! నేను గ్రంథాలలో వుండే లోటు గురించి కాదు అడిగేది. సంసారంలో అన్నపానాదులు, పాత్రలు, సరుకులు, వస్త్రాదులు వంటి వాటిలో వుండే లోటు గురించి అడుగుతున్నాను" అన్నాడు. అప్పుడు ఆ పండితుడు "ఇంటి సంగతి ఇల్లాలికెరుక. నాకసలు ఆ సంగతులు ఏవీ తెలియవు. నేను భగవంతుని ధ్యాసలో పడితే ఇల్లు గురించి పట్టించుకోను" అన్నాడు. అలా సదా భగవంతుని ధ్యాసలో మునిగి వుండే వారి వద్దకు సాక్షాత్తు ఆ మహారాజు వచ్చినాగాని ప్రాపంచిక విషయాల గురించి వారు అడగరు.

వెంటనే ఆ మహారాజు "ఇంటి విషయాల గురించి మీరా పట్టించుకోరు. పోనీ నన్ను స్వయంగా అమ్మగారితో మాట్లాడే అనుమతి ఇవ్వండి" అని ప్రార్థించి, ఇంటి లోపలికి వెళ్ళి, తలవంచి ఆవిడకు నమస్కరించి, "అమ్మా! మీ ఇంట్లో అన్న, పాన, వస్త్రాదుల కేమైనా లోటు వుంటే నాకు ఆజ్ఞ ఇవ్వండి. నాకు సేవ చేసుకునే భాగ్యాన్ని ప్రసాదించండి. ఏ దేశంలో అయితే పావన చరిత్రులు కష్టాలపాలవుతారో, దానివల్ల ఆ దేశపు రాజుకే పాపం తగులుతుంది. రాజ్యానికి కళంకం వస్తుంది. చెప్పండి తల్లీ! ఏం సేవ చేయమంటారు మీకు?" అని అడిగాడు.

ఈ లోగా ఆ పండితుడు తన ఆసనం, చాప, చేత్తోపట్టుకుని, తన భార్యతో "ఆ పుస్తకాలు ఇలా ఇవ్వు. మనం ఇక్కడి నుంచి వేరే ఎక్కడికైనా వెళ్ళిపోవాలి. మనం ఇక్కడ వుండటం వలన ఈ రాజుకు పాపం అంటుకుంటుందిట. రాజ్యానికి కళంకమట. మన కారణంగా ఎవరికీ ఎటువంటి దుఃఖం కలుగకూడదు. ఎక్కడికైనా వెళ్ళిపోదాం పద" అన్నాడు.

వెంటనే రాజు ఆ పండితుడి పాదాలపై పడి "మహాప్రభో! నా భావం అది కాదు. మీకు సేవచేసుకునే అవకాశం ఇమ్మంటున్నాను అంతే. దయచేసి కోప్పడకండి" అని అర్థించాడు. "నాకు ఎటువంటి

సేవా అవసరం లేదు. ఆమెను కనుక్కో" అన్నాడా పండితుడు.

ఆ పండితుని భార్య రాజుతో "భగవంతుడు నదులు ఇస్తున్నాడు, సూర్యుడేమో వెలుగునిస్తున్నాడు, అనంత పరమాత్ముడు ప్రాణ వాయువులనిచ్చి మన జీవితాలను చైతన్యవంతం చేస్తున్నాడు. మన రక్తాన్ని శుద్ధి చేసేందుకై గుండె ఆడేలా చేస్తున్నాడు. ఆ అనంత బ్రహ్మాండ నాయకుడు పరమాత్ముడే సదా మన వెంట వుండగా ఇక మనకు లోటేమున్నది? ఓ రాజా! మా కేమీ లోటు లేదు. ఆ పరమాత్ముడు సంపూర్ణంగా మా హృదయాలలో నివసిస్తున్నాడు. సర్వవ్యాపి, సర్వశక్తిమంతుడు, స్ఫూర్తి ప్రదాత అయిన ఆ పరమాత్ముడు మాలో వుండి, మా జీవితాన్ని నడిపిస్తున్నాడు. మా శ్వాసలలో వుండి మా ఇంద్రియాలకు శక్తినిస్తున్నాడు. ఆయన నిద్రలోనూ, మెలకువలోనూ కూడా మమ్మల్ని రక్షిస్తూ తనవైపుకు నడిపించుకుంటున్నాడు.

ఓ రాజా! మా ఇంట్లో సాయంత్రానికి సరిపడే పిండి మిగిలి వున్నది. రెండు రోజులకు సరిపడే కట్టెలు వున్నాయి. మిర్చి, మసాలాలు రేపటి వరకూ వస్తాయి. పక్షులు సాయంత్రం వరకు గింజలు లేకపోయినా ఆనందంగా జీవిస్తుంటాయి. మా దగ్గర రేపటి వరకూ సరుకులు వుండగా ఇక చింతదేనికి? ఓ రాజా! నా బట్టలేమీ కట్టుకోలేనంతగా చిరిగిపోలేదు. పాతవైపోయాయి తప్ప చిరగలేదు. రెండు చీరలున్నాయి. కప్పుకునేందుకు మాకు ఒక దుప్పటి కూడా వుంది. ఇంట్లో ఒక చాప కూడా వుంది. నా పసుపు కుంకుమలు అమరమైనవి. ఆయన నాతోనే వున్నారు. అందరిలో నెలకొన్న నా భర్త తత్త్వం నా హృదయంలో స్పందిస్తోంది. ఇక నాకేమి లోటు బాబూ?" అన్నది.

ఆ రాజు కరిగిపోయి, ఆవిడ పాదాలపై పడి "మీకు చెప్పటం కష్టం చాలా కష్టం. మీ పాదాలకు నా శతకోటి వందనాలు" అన్నాడు.

ఇలా పరమాత్ముని అనుగ్రహం పొందినవారికి మండలేశ్వరులు కావాలనీ, పదవిప్రతిష్ఠలు పొందాలనీ వుండదు. పరమాత్మయందు లీనమైన వారికి ప్రపంచం లోటుపాట్లు గురించి లెక్కవుండదు.

(గత సంచిక తరువాయి)

# త్యాగ మహిమ

- మురళి

చక్రవేణుని మంత్రి తాను తయారుచేసిన నకిలీ లంకానగరాన్ని రావణునికి చూపిస్తూ 'చూడండి! ఇది పూర్తిగా మీ లంకా నగరాన్ని పోలి వుంది. తూర్పువైపు కోట, ద్వారము, బురుజు మరియు తోరణము అన్నీ స్పష్టంగా వున్నవి వున్నట్లుగా కనిపిస్తున్నాయి. నేను రాజు చక్రవేణుని ఒట్టు తీసుకుని, నకిలీ లంకానగరం యొక్క పూర్వద్వారాన్ని పడగొడతాను. దీనితో మీ అసలు లంక యొక్క పూర్వద్వారం కూలి పోవటాన్ని మీరు చూస్తారు' అని చెప్పి, 'రాజు చక్రవేణుని ఆన' అని చెప్పి, తాను తయారు చేసిన నకిలీ లంక యొక్క పూర్వ ద్వారాన్ని పడగొట్టాడు. అది పడిపోవటంతోనే రావణుని యొక్క నిజమైన లంక యొక్క పూర్వద్వారం పడిపోతూ కనిపించింది. అది చూసి రావణునికి చాలా ఆశ్చర్యం వేసింది.

తరువాత మంత్రి 'నేను ఇప్పుడు నకిలీ లంక యొక్క తూర్పువైపు నాలుగు బురుజులను పడగొడతాను, దీనితో మీ నిజ లంక యొక్క నాలుగు బురుజులు కూలిపోతాయి చూడండి' అని, చక్రవేణుని ఆన తీసుకుని నకిలీ లంక యొక్క తూర్పువైపు నాలుగు బురుజులు కూల్చివేశాడు. దానితో రావణుని యొక్క నిజమైన లంక యొక్క తూర్పు నాలుగు బురుజులు పిండిపిండిగా మారి కూలిపోయాయి. ఇది చూసిన రావణునికి చాలా ఆశ్చర్యం వేసింది. మండోదరి చెప్పిన మాట గుర్తుకు వచ్చింది.

చక్రవేణుని మంత్రి 'రాజా! మీరు మణుగు బంగారాన్ని పన్ను రూపంలో ఇవ్వకపోతే కూడా రాజు చక్రవేణునికి మీతో యుద్ధం చేయ వలసిన అవసరం వుండదు. రాజు చక్రవేణుని యొక్క చక్రం నడుస్తుంటుంది. రాజు చక్రవేణుని ఆన తీసుకుని నేను ఒక్కడినే, ఇప్పుడే మీ లంకను క్షణంలో నశింపజేయగలను. మీరు రక్షించుకోగలిగితే రక్షించుకోండి. లేదా పన్ను రూపంలో మణుగు బంగారాన్ని ఇవ్వండి. ఇది తప్ప వేరే మార్గం లేదు' అన్నాడు. రావణుడు ఆలోచించాడు. చూస్తూ వుండగానే లోహముతో చేసిన బురుజులు నేల కూలాయి. ఈ విధంగా లంకనంతా నాశనం చేయడం ఇతనికి చాలా తేలిక అని ఆలోచించి, మణుగు బంగారం ఇవ్వడానికి అంగీకరించాడు.

మంత్రి మణుగు బంగారం తీసుకుని తన రాజ్యానికి వచ్చి రాజు

చక్రవేణునికి సమర్పించాడు. రాజు 'నీవు ఈ బంగారాన్ని ఎలా పొందావో వివరంగా చెప్పు' అన్నాడు. అప్పుడు మంత్రి జరిగిన విషయం అంతా వివరంగా తెలియజేశాడు. ఈ సంఘటన విని రాణికి ఆశ్చర్యం కలిగింది. ఆమెపై దీని ప్రభావం బాగా పడింది. రాజుని ఎందుకిలా జరిగిందని అడిగింది.

అప్పుడు రాజు 'మనం ఎవరి మీదా ఆధారపడకుండా పరిశ్రమ పూర్వకంగా వ్యవసాయాన్ని చేసి, మనల్ని మనమే పోషించుకుంటూ, వైరాగ్యముతో, త్యాగబుద్ధితో జీవితాన్ని గడుపుతున్నాము. అంతేకాక నిష్కామ భావనతో ప్రజల ధనాన్ని ప్రజల సేవలోనే వినియోగిస్తాము. మన వ్యక్తిగతమైన పనులకు ప్రజల ధనాన్ని ముట్టనైనా ముట్టము. దాని ప్రభావమే ఇదంతా' అని చెప్పాడు.

ఈ సంఘటన విన్న రాణి మనస్సు మారిపోయింది. ఆమె రాజుతో 'స్వామీ! నేను బహుమూల్యమైన బట్టలను, నగలను ధరించను. ఇంత వరకు ఎలా నియమంగా వున్నానో, ఇక ముందు కూడా అలాగే వుంటాను. ధనికుల స్త్రీల చెడు ప్రబోధనల వలన నా బుద్ధి, త్యాగము, వైరాగ్యము, ధర్మము చలించినవి. ఇప్పుడు వాళ్ళ మాటల ప్రభావం నా మీద ఏదీ లేదు. మీరు నా తప్పును క్షమించి, ఈ బంగారాన్ని తిరిగి యిచ్చివేయండి' అన్నది. రాజు 'మంత్రీ! పరమేశ్వరని కృపచేత రాణిపై పడిన చెడ్డ ప్రభావం తొలగిపోయింది. నీవు తెచ్చిన బంగారం తిరిగి రావణునకు ఇచ్చిరా' అన్నాడు.

మంత్రి తిరిగి లంకా నగరాన్ని చేరి, రావణుని సభకు వెళ్ళి 'మహారాజా! చక్రవేణుడు మీకు ఈ బంగారాన్ని తిరిగి ఇవ్వమన్నారు. ఆయన భార్యకు విలువైన వస్త్రాలు, నగలు ధరించాలన్న కోరిక పరమేశ్వరుని కృప వలన తొలగిపోయింది. కావున ఆమెకు ఈ బంగారంతో అవసరం లేదు' అని చెప్పి తిరిగి ఇచ్చివేశాడు. రావణుడు ఆ మాటలు విని చక్రవేణుని త్యాగశీలతను ఎంతగానో కొనియాడాడు. ఆ మంత్రిని సత్కరించి పంపాడు.

నీతి - మానవులందరూ నిష్కామ భావనతో వర్ణాశ్రమ ధర్మాన్ననుసరించి సత్యపూర్వకంగా జీవితాన్ని గడపాలి. ప్రాణులన్నీ పరమాత్మ స్వరూపమని తెలిసికొని అహంకారం లేకుండా, అందరిపట్లా సమ భావనతో దయను కలిగి వుండాలి.

# శివుని కథలు

- రమణ ప్రసాద్

## అర్ధనారీశ్వరుడు

జటాజూటధారి, శశిధరుడు, సర్పాలను ఆభరణములుగా ధరించినవాడు, మృగచర్మాంబరధారి, వృషభవాహనుడు, త్రిశూలధారి, నీల వర్ణుడు పురుషాకృతితో కుడివైపు, స్త్రీ రూపం ధరించి ,చేతిలో పద్మం, మెడలో బంగారు ఆభరణాలు ధరించి , అరుణ కాంతులతో ఎడమభాగాన విలసిల్లే అర్ధనారీశ్వరునికి నమస్కరిస్తున్నాను.



పురాణాలలోశివుడు అర్ధనారీశ్వర రూపం ఎందుకు ధరించవలసి వచ్చిందో ఈ విధంగా చెప్పబడింది : -

భృంగి శివ భక్తులలో అగ్రగణ్యుడు. ఆయన శివుడినేగాని, శక్తిని కొలిచేవాడు కాదు. శక్తి స్వరూపిణి భృంగి మహర్షి లోనుంచి శక్తిని ఉపసంహరించటంతో ఆయన నిర్వీర్యుడైనాడు. శక్తిహీనుడైన భృంగి లేచి నుంచోలేకపోయాడు. శివుని ప్రార్థించగా శివుడు దండాన్ని ప్రసాదించాడు. ఆ దండం సహాయంతో ఆయన శివుడినే కొలిచాడు. జగన్మాత శివునిలో విడదీయరాని అంశ కావాలని కేదార మహా వ్రతాన్ని చేసింది. శివుడు ఆమె భక్తికి మెచ్చి ఆమె కోరిన వరం ప్రసాదించాడు. ఆమెకు తన ఎడమభాగంలో స్థానం ఇచ్చాడు. ఆరోజే దీపావళి రోజు. ఆనాటినుండి శివుడు అర్ధనారీశ్వరుడుగా కొలువబడుతున్నాడు.

హిందువులు అర్ధనారీశ్వరుని తమ దైవంగా పూజిస్తారు. కాని తమ భక్తి ఫలించటానికి మానవులు దేవుడిని పురుషరూపంగా, లేక స్త్రీ రూపంగా కొలువటం పరిపాటి. భగవంతుడు నిరాకారుడు. జనన మరణాలు లేనివాడు. లింగభేదం లేనివాడు.

"నాకారం నో వికారం నహి జని మరణం న నపుంసో న చ స్త్రీ"అని గురుగీత చెబుతోంది. భగవంతుడు నామ,రూప, క్రియా రహితుడు. ఆయనే పరబ్రహ్మ. చైతన్య స్వరూపుడు.చైతన్యం అంటే శక్తి. చైతన్యంలేని శరీరం జడం. శివ శక్తుల కలయికే శివుని అర్ధనారీశ్వర రూపం. ఏ విధంగా

మంచు, నీరు, ఆవిరి ఒకే స్వరూపమో, ఆ విధంగా శివుని శక్తినుండి విడదీయలేము. వారు లోకోద్ధారణకోసం పరమ శివుడిగా , శక్తి స్వరూపిణిగా అవతార ధారణ చేస్తారు. శాస్త్రాలు వారిని పరమ శివుడని, జగన్మాత అని వర్ణిస్తాయి.

('బొమ్మల కొలువు' - 15వ పేజీ తరువాయి భాగం )

' శ్రీవామనమూర్తి ఒక పాదంతో నేలను తాకి ఇంకొక పాదంతో ఊర్ధ్వలోకాలను ఆక్రమించి ఇంకా బ్రహ్మాండాన్ని దాటి పట్టకపోతే సత్యలోకాన్ని వ్యాపింపగా, అక్కడ బ్రహ్మ తన కమండలంలోని జలాలతో అభిషేకించాడు. ఈజలమే దేవనదిగా ప్రవహించింది.

మూడవపాదాన్ని ఎక్కడపెట్టాలో చెప్పమన్నాడు" అని శ్రీ ప్రసాద్‌గారు చెప్పినప్పుడు మనమందరం ఆ త్రివిక్రముడి రూపాన్ని మనం ఊహించుకోలేదూ! ఇంతకీ మనం ఎవరి పార్టీ? వామనునిపార్టీయా? లేక బలిచక్రవర్తి పార్టీయా? భగవంతుడెప్పుడూ భగవంతుడే. ఆయన జగన్నాటక చక్రవర్తి. భగవంతుడి లీలలను మనకు అందించినది బలిచక్రవర్తి కాబట్టి మనం బలిచక్రవర్తి పార్టీ. గురువైన శుక్రాచార్యుడు అడ్డుపడితే ఏమైంది? తను ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నాడు. నిజమైన గురుతత్త్వాన్ని గుర్తించాడు. బలి చక్రవర్తి, శ్రీవామనమూర్తి ఒకటైన తర్వాత శుక్రాచార్యుడు చెప్పగలిగింది, చేయగలది ఏముంది?

ఆయన సృష్టించిన బొమ్మలకొలువులో మనమంతా వున్నాం. వారి దర్శన, స్పర్శన, సంభాషణ భాగ్యాలు మనకి లభించాయి. వారి అనుగ్రహం మనపైన పరిపూర్ణంగా ఉంది. శ్రీ గురుదేవులు మనందరికీ అట్టి శక్తిని, భక్తిని, సాధనా సంపత్తిని ప్రసాదించుగాక

సుఖీభవ! సుఖీభవ !!

# సాధన చతుష్టయం

-పరాశర ప్రసాద్

ఆధ్యాత్మిక విద్యను అభ్యసించటానికి అందరూ అర్హులే! దానిని అభ్యసించే హక్కు అందరికీ ఉంది. అయినప్పటికీ దానిని పొందటానికి ప్రాపంచిక విద్యవలెనే కొన్ని అర్హతలు అవసరమని శాస్త్రాలు చెబుతున్నాయి. ఆకలిగొన్నవాడు మాత్రమే ఆహారాన్ని స్వీకరించగలుగుతాడు కదా! వ్యాధిగ్రస్థుడు మాత్రమే వైద్యుణ్ణి సంప్రదిస్తాడు. అలాగే తన జీవిత పరమార్థాన్ని తెలిసికొనగోరే సాధకుడు మాత్రమే ఆధ్యాత్మిక విద్యను అభ్యసించడానికి తగు ప్రయత్నం చేస్తాడు.

ముందుగా పవిత్ర అంతఃకరణ కలిగి వుండాలి. దానికి తోడుగా సాధన చతుష్టయ సంపత్తి కలిగివున్నప్పుడే అది సాధ్యపడుతుంది. అప్పుడే ఆధ్యాత్మిక విద్యకు అధికారి అవుతాడు. అంతేకాదు సమర్థుడైన సద్గురు మూర్తి మార్గదర్శకత్వంలోనే అది సాధ్యపడుతుంది. సాధన చతుష్టయం అంటే ......... 1. నిత్యానిత్యవస్తు వివేకము, 2. ఇహాముత్ర ఫలభోగ విరాగము, 3. శమాది షట్క సంపత్తి, 4. ముముక్షత్వము.

ముందుగా నిర్మల అంతఃకరణ కలిగి వుండాలి. అంటే మనోవాక్కాయాలు శుద్ధి చెందాలి. ఈ త్రికరణముల ద్వారా ఎవరి మనస్సు నొప్పించరాదు. ఆ స్థితిని సాధించిన తరువాత తాను ఆశ్రయించిన గురుమూర్తి బోధా శ్రవణం ద్వారా బుద్ధి ప్రేరణ చెంది, మనస్సు వివేకవంతమైన విచారణకు ప్రోత్సహిస్తుంది. అదే నిత్యానిత్య వస్తు వివేకము లేదా సత్యాసత్య వివేకము, లేక ఆత్మానాత్మ వివేకము.

వివేకవంతమైన విచారణ ద్వారా ఏది సత్యము? ఏది అసత్యము? ఏది శాశ్వతము? ఏది అశాశ్వతము? అనే విచారణ ద్వారా సృష్టిలో గోచరమయ్యే వస్తువులన్నీ అశాశ్వతమని గ్రహించగలుగుతాడు. అంతేకాదు శాశ్వత చైతన్యము లేక ఆత్మవస్తువే సర్వసృష్టికి ఆధారమని కూడా తెలుసుకోగలుగుతాడు.

నిత్యానిత్య వస్తు వివేకము ద్వారా క్రమక్రమంగా పైకి ఎదిగిన కొద్దీ వైరాగ్యము కలుగుతుంది. ప్రాపంచిక విషయాలన్నీ అశాశ్వతమని తెలిసికొన్న వెంటనే వాటిమీద అనాసక్తి లేదా విరాగము కలుగుతుంది. ప్రతి మానవుడు తాను ఆచరించే పుణ్యకర్మల ద్వారా స్వర్గ సుఖాలో,

ఇంకా ఏదైనా సుఖాలో పొందుతానన్న ఆశను కలిగి వుండవచ్చు. ప్రాపంచిక సుఖాలయందు అనాసక్తి కలిగిన తరువాత పరలోక సుఖాల యందు కూడా విరాగము కలుగుతుంది.

ఇహలోక పరలోక విరాగము సాధించిన సాధకుడు శమాది షట్క సంపత్తిని తప్పక పొందగలుగుతాడు. ఇది శమము, దమము, ఉపరతి, తితీక్ష శ్రద్ధ, సమాధానము అని ఆరు అంశలతో కూడి వుంటుంది. శమము అనగా అంతరేంద్రియ నిగ్రహము. మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారము అనేవి అంతరేంద్రియాలు. మనస్సు సంకల్పిస్తే, బుద్ధి నిర్ణయించి, చిత్తము ఆ సంకల్పానికి రూపకల్పన చేస్తుంది. అహంకారము దాని యొక్క క్రియను నిర్వహిస్తుంది. మనస్సు అన్ని ఇంద్రియాలకు మెయిన్ స్విచ్. కాబట్టి ముందుగా అంతరేంద్రియ నిగ్రహం సాధించాలి.

దమము అంటే బాహ్యేంద్రియ నిగ్రహము. ఇంద్రియ నిగ్రహం సాధించటం ద్వారా మనస్సు ప్రాపంచిక వ్యవహారాలకు దూరమై, సాధకుని యొక్క ధ్యేయమునందే అనురక్తిని కలిగి వుంటుంది. దీనినే ఉపరతి అనవచ్చు.

ఇది క్రమేపి దృఢమైన పిమ్మట మనస్సు అంతర్ముఖమై స్థిరపడి నిశ్చలస్థితిని పొందుతుంది. అక్కడ సాధకుని మనస్సులో చంచల స్వభావము రహితమై సుఖదుఃఖముల యందు, రాగ ద్వేషముల యందు, దూషణ భూషణల యందు సమదృష్టి కలుగుతుంది. దీనినే తితీక్ష అంటారు.

ఈ విధంగా స్థిరపడిన మనస్సు గురుమూర్తి ప్రబోధమందు తన సాధన యొక్క ధ్యేయమునందు శ్రద్ధ పెంపొందుతుంది. ఆ శ్రద్ధని సంప్రాప్తింపజేసేదే విచారణ. సాధకునిలో శ్రద్ధ పెంపొందిన తరువాత ఆత్మజ్ఞాన ప్రాప్తికై తీవ్ర ఆవేదన చెందుతూ తీవ్ర సాధన కొనసాగిస్తాడు. తత్ఫలితంగా సద్గురుమూర్తి అనుగ్రహంతో జ్ఞానమార్గంలో కొనసాగుతాడు. అదే సమాధానము. అక్కడ అన్యభావాలన్నీ తొలగిపోతాయి.

శమాది షట్క సంపత్తిని సాధించి, అధికారియై, తాను ఆశ్రయించిన సద్గురుమూర్తి ప్రసాదించిన మంత్రరాజమును కొనసాగించే సాధకుడే ముముక్షువు.

# యోగవాశిష్ఠము

(గత సంచిక తరువాయి) - సుషుమ్నా ప్రసాద

## శిఖిధ్వజుని కథ

కుంభముని మరల చూడాల రూపాన్ని ధరించి ఆకాశ యానము చేసి, తన నగరమునకు వెళ్లి, అక్కడ రాచకార్యములను నిర్వర్తించింది. మరల కుంభముని రూపం దాల్చి, గాలిలో పయనించి, శిఖిధ్వజుని నివాసము ముందు వాలింది. శిఖిధ్వజుడిలా అన్నాడు, 'ఓ మునివర్యా, మీరు మహర్షి కదా! మీరీ రోజు యెందుకు విచారంగా వున్నారు?"



కుంభముని సమాధానం చెప్పాడు, "ఎలాంటి విషమ పరిస్థితులలో కూడ చలించకుండా, సహనంగా వుండేవారే సత్యాన్ని గ్రహించినవారు. లేని వారు మోసకారులే. మనకు శరీరాలు వున్నంత వరకు, శరీరావయవములను సక్రమ పద్ధతిలో పనిచేయించాలి, సృష్టికర్త బ్రహ్మ, మిగిలిన దేవుళ్ళు కూడ భౌతిక శారీరక ఆవశ్యకతల నంగీకరించవలసినదే, ఏ వొక్కరూ కూడ భగవన్నిర్దేశితమైన న్యాయానికి యెదురీదలేరు. విధి యొక్క ప్రభావమునెదిరించే శక్తి యేఒక్కరికీ లేదు, నదులలోని నీరెలా సముద్రములో కలుస్తుందో, అలాగే విధి అన్ని వస్తువులనూ, తాను నిర్దేశించిన మార్గములో చరించేట్లు చేస్తుంది."

అప్పుడు శిఖిధ్వజుడిలా అన్నాడు "అలాంటి సందర్భంలో మీకేది జరిగినా, దానికి విచారించకూడదు కదా!"

కుంభమునిలా సమాధానం చెప్పాడు: ఓ రాజా ఒక ఆశ్చర్య భరితమైన, ఆకస్మిక సంఘటన జరిగింది. అది విని మీరంతా ఆశ్చర్యపడతారు.

చూడాల శిఖిధ్వజుని బ్రహ్మచర్య ధృడత్వమును పరీక్షించాలను కొన్నది, అందులకామె రాజుగార్కి ఒక సంఘటనను వివరించింది. "నేను నీకు పుష్పగుచ్ఛము యిచ్చిన తర్వాత ఆకాశయానము చేసి, దేవలోకములో వున్న మా తండ్రిగారి వద్దకు వెళ్ళి, ఇంద్ర సభకు హాజరయ్యాను. తరువాత వాయుగోళములో ప్రవేశించి, అక్కడ నుండి భూలోకానికి వచ్చాను, నేను దుర్వాస మహర్షిని కలిశాను, ఆయనతో అన్నాను, మీరు నీలిమేఘాలను కప్పుకొన్నట్లున్నారు, ప్రేమించిన యువతి తన ప్రియుణ్ణి కలుసుకోటానికి

ఎంత వడివడిగా నడుస్తుందో, మీరు కూడ అంతవేగంగా నడుస్తున్నారు,

"నా మాటలు వినగానే, దుర్వాసముని ఆగ్రహావేశముతో, నన్ను శపించాడు "నీవు ప్రతి రాత్రి వన్నె చిన్నెల అందమైన యువతిగా మారుతావు!" ఆ ముని ముందు నేనెందుకలా తొందరపాటుగా ప్రవర్తించానని సిగ్గుపడుతున్నాను, అప్పటి నుండి ప్రతి రాత్రి స్త్రీ రూపం ధరిస్తాను, ఈ విషయంలో నేను చాలా బాధపడుతున్నాను".

దానికి సమాధానంగా శిఖిధ్వజుడిలా అన్నాడు 'ఓ మునీ! విధి నిర్ణయానికెవరూ యెదురీదలేరు, మీరు ఋషీశ్వరులు. మీరెన్నటికీ మారని ఆత్మ. మీ శారీరక మార్పు, ఎన్నటికీ మార్పులేని ఆత్మను ప్రభావితం చేయలేవు, ఆత్మకెలాంటి మార్పులేదు.

చూడాల పగలు కుంభముని రూపంలో, రాత్రులు స్త్రీ రూపంలో కాలం గడుపుతున్నది. ఒకరోజు కుంభముని యిలా అన్నాడు "ఎంత కాలము నేను కన్యగా వుండాలి? నేను మిమ్మల్ని నాభర్తగా యెన్నుకొన్నాను. దయచేసి ప్రతి రాత్రి మీరు నన్ను మీ భార్యగా స్వీకరించండి".

శిఖిధ్వజుడిలా అన్నాడు "మీ యిష్టం వచ్చినట్లు మీరు చేయటానికి స్వేచ్ఛవున్నది". అనంతరం వారి వివాహము మందర పర్వతము పై, వారి యిష్టానుసారము వారి యనుమతితో గాంధర్వ వివాహము సింహ మాసమున (ఆగష్టు-సెప్టెంబరు) పూర్ణిమ నాడు జరిగింది, చూడాల యిప్పుడు మదనికయనే పేరుతో పిలువబడుతున్నది.

ప్రతి మూడవ రాత్రి, మదనిక రాజుగారు నిద్రపోగానే, చూడాల రూపము ధరించి, రాజ్యానికి వెళ్లి, తన రాచకార్యములను నిర్వర్తించేది. రాజకార్యములు పూర్తికాగానే, తాను తిరిగి, అరణ్యములో వున్న తన భర్త వద్దకు వచ్చేది.

"ఆమె తన యోగ మహిమ వలన, యింద్రుడు శిఖిధ్వజుని ముందు ప్రత్యక్షమయేట్లు చేసింది, ఇంద్రుడిలా సంభాషించాడు "ఓ రాజా, మీ తపస్సు సద్గుణములతో నేను బాగా ఆకర్షితుడనయ్యాను, మీరు దేవలోకమునకు రండి. అక్కడ రంభ, ఊర్వశి మున్నగు దేవకాంతలు, నర్తకులు, మీరాకకై యెదురు చూస్తున్నారు. మీరక్కడ, అన్ని రకాల భోగాలను, సౌఖ్యాలను అనుభవించవచ్చు.

శిఖిధ్వజుడిలా సమాధానం చెప్పాడు "ఓ దేవేంద్రా! నేనెక్కడుంటే, అదే స్వర్గం నాకు స్వర్గలోక భోగాలు, సుఖాలు బాగా తెలుసు నాకింకేమి అవసరములేదు." శిఖిధ్వజుడు దేనికీ చలించకుండా సమతుల్యమైన మనసుతో వున్నాడు. ఆయనకు దేనిపట్ల ఆకర్షణలేదు విముఖతలేదు.

- సశేషం

# శ్రీ కాళీగార్డెన్స్ ఆశ్రమంలో కార్యక్రమాలు

ఏప్రియల్ 2018

10 మంగళ - శ్రీగురుదశమి. సత్సంగం, శ్రీసద్గురు పాదపూజ.

14 శని - మాసశివరాత్రి, శని త్రయోదశి. పావులూరులో ఏకాహం.

16 సోమ - అమావాస్య.

18 బుధ - అక్షయ తృతీయ, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన.

20 శుక్ర - శ్రీశంకరాచార్య జయంతి, శ్రీసద్గురు త్రివింశతి (23)వ ప్రతిష్ఠావార్షికోత్సవం - సత్సంగము, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన.

28 శని - శని త్రయోదశి.

29 ఆది - వైశాఖ పూర్ణిమ , బుద్ధ జయంతి - సత్సంగం, శ్రీసద్గురు పాదపూజ, భక్తసమారాధన.

మే 2018

05 శని - వైశాఖ బహుళ పంచమి - శ్రీమహాకాళికా పరమేశ్వరీ సహిత రామలింగేశ్వరస్వామివారల ప్రతిష్ఠా మహోత్సవము, లీలా కళ్యాణము.

10 గురు - శ్రీ గురుదశమి - హనుమజ్జయంతి - సత్సంగం, శ్రీ సద్గురు పాద పూజ.

14 సోమ - మాస శివరాత్రి , పావులూరులో ఏకాహం.

15 మంగ - అమావాస్య.

23 బుధ - జేష్ఠ శుద్ధ నవమి - శ్రీ సుగుణ ప్రసాద మాతాజీ వారి ఏకాదశ వార్షికారాధన.

29 మంగ - పూర్ణిమ(అధిక జేష్ట పూర్ణిమ), శ్రీ సద్గురు పాదపూజ

**విశాఖపట్నంలో పూజ్యశ్రీ మాతాజీవారి**
**సత్సంగ సమావేశములు**

ది. 5-4-2018 నుండి 8-4-2018 వరకు
శ్రీకృష్ణ (గురువాయూరప్పన్) మందిరం,
సీతమ్మధార నార్త్ ఎక్స్టెన్షన్ నందు
**పూజ్య శ్రీ చంద్రకాళీప్రసాద మాతాజీ వారి**
సత్సంగ సమావేశములు.
అందరూ ఆహ్వానితులే!

వివరములకు - శ్రీ దాసరి ఆనంద్‌గారు - 98480 57814
శ్రీ దాసరి చిన బ్రహ్మయ్య గారు - 99490 88052

# పరిప్రశ్న

- పరాశర ప్రసాద్

సగుణారాధన చాలా గొప్పది. దానిలోని మాధుర్యం పొందని వారుండరు. సగుణమే లేకపోతే భారత రామాయణ గ్రంధాలు మనకు లభించేవా? వాటి మాధుర్యాన్ని గ్రోలేవారా? అంతేకాదు మహాత్ముల దివ్య చరిత్రలు మానవులకు అందుబాటులో ఉండేవా? అది యదార్థమే. కాని 'సగుణారాధన నుండి నిర్గుణారాధనకి ఎదిగితేగాని మానవుడు ఆత్మజ్ఞానాన్ని పొందడు' అని సద్గురుదేవులు హెచ్చరించేవారు. సగుణారాధన చేయనిదే నిర్గుణానికి ఎదగటం సాధ్యం కాదు. శాస్త్ర జ్ఞానం ఎంత వున్నా, మహాత్ముల సంశ్రయం లభించి, వారి దర్శన, స్పర్శన, సంభాషణ భాగ్యం లభించనిదే ఆత్మజ్ఞానం పొందాలనే ఇచ్ఛ కలగటం అసంభవం.



అందువల్లనే బ్రహ్మదేవుడు తనను ఆశ్రయించిన అశ్వలాయనునికి ఆత్మజ్ఞానం పొందే మార్గాన్ని తెలియజేయమన్నప్పుడు 'శ్రద్ధా భక్తి ధ్యాన యోగాదవేహి' అన్న విషయాన్ని తెలియజేశాడు. తత్త్వం శాస్త్ర జ్ఞానం, శబ్ద జ్ఞానం ద్వారా లభించేది కాదు. అది అంతర జ్ఞానము. అది అంతర్గతంగా నీ హృదయంలో నిక్షిప్తమైయున్నది. అది సిద్ధించేదేకాని ఏ ప్రక్రియ ద్వారా లభించేది కాదు. దానిని సిద్ధింపజేసుకోవటానికి శ్రద్ధ కావాలి. శ్రద్ధ అనేది బుద్ధి యొక్క వివేకము లేదా వికాసము. 'ధీ'యో యోనః ప్రచోదయాత్' అన్నట్లుగా "అది కేవలం గురుబోధా శ్రవణం, గురులక్ష్యార్థ సాధన, గురుసేవ ద్వారా పొందగలుగుతావు" అని ఆచార్యులు చెప్పారు.

బుద్ధి వికసించిన మరుక్షణం శ్రద్ధ కలుగుతుంది. ఆసక్తి కలుగుతుంది. ఆత్మజ్ఞానం పొందాలన్న ఆవేదన కలుగుతుంది. దానికి తగిన పురుషప్రయత్నం చేయటం కూడా సాధ్యపడుతుంది. తీవ్ర ఆవేదన ప్రయత్నానికి దోహదం చేస్తుంది. ఇల్లు తగలబడుతోంది. దానిలో ఒక పిల్లి బందీ అయి వుంది. అది ఎలాగైనా తప్పించుకోవాలని ప్రయత్నించక

మానదు కదా! శ్రద్ధ కలిగిన మరుక్షణం శ్రవణం చేసిన గురుబోధని మననం చేయటం జరుగుతుంది.

శ్రద్ధ లేని శ్రవణం నిష్ప్రయోజనం. అది మననానికి రాదు. మననం ద్వారా మనస్సులో ప్రేమ కలుగుతుంది. బుద్ధి శ్రద్ధా రూపమైతే మనస్సు ప్రేమ మందిరం. ప్రేమయే భక్తి. భక్తి ఆరూఢమైన కొలది విచారణకి దారి తీస్తుంది. విచారణ ద్వారా మనస్సు స్థిరపడుతుంది. హృదయాకాశ మంతా తత్త్వంతో నిండి ఉంటుంది. అప్పుడు ఈ నవద్వారములతో కూడిన దేహం 'శారీరం కేవలా కర్మ' అన్నట్లుగా దేహం ద్వారా ఆచరించిన ఏ కర్మ అయినా స్వార్థరహిత నిష్కామ కర్మ అవుతుంది. 'కుర్వన్నేవేహ కర్మాణి జిజీవిషేచ్ఛతగ్ం సమాః ఏవత్వయీ నాన్యథేతోస్తి నకర్మ లిప్యతే నరే' అన్న ఉపనిషత్ వాక్యము యదార్థమవుతుంది.

అటువంటి సాధకుడు జగత్తులో ఏ వ్యవహారంలో ఉన్నా ఏ కర్మ ఆచరించినా నవరంధ్రాలలో దేని నుండైనా ఈశ్వర భావానికి భిన్నమై నది లోనికి ప్రవేశించగలుగుతుందా? దీనిని వివరిస్తూ శ్రీగురుదేవులు ఒక ఉదాహరణ చెప్పేవారు. నీటితో పూర్తిగా నింపిన ఒక కుండని ఒక తటాకంలో ముంచి ఆకుండకి తొమ్మిది రంధ్రాలు చేసినా తటాకంలోని నీరు కుండలోకి ప్రవేశించగలదా? అసంభవము. ఎందువలనంటే కుండ నిండా నీరు ఉన్నది కాబట్టి, వెలుపలి నీరు లోనికి ప్రవేశించే అవకాశమే లేదు. అలాగే నీ హృదయమంతా తత్త్వ పూరితమై పూర్ణంగా ఉంటే నువ్వు ఎక్కడ వున్నా, బాహ్య విషయాలు నీలోకి ప్రవేశించే అవకాశమే వుండదు కదా!

అందువల్ల ధ్యానం ఫలించాలంటే స్థిర చిత్తం కలిగి వుండాలి. దానికి మనస్సు బుద్ధుల సమన్వయం సాధించాలి. శ్రద్ధా భక్తిల సమన్వయమే ధ్యానము. అదే నిర్గుణ సాధనకి సరియైన మార్గము అని శ్రీసద్గురుదేవులు బోధించారు.

శుభాభినందనలతో ...

Grand
RADIATORS
AN ISO 9001:2008 CERTIFIED COMPANY

Manufactures of Radiators (Automobile and Industrial), Oil Coolers, Air Coolers, After Coolers, Inter Coolers, Finned Tube Coolers, Shell and Tube Heat Exchngers,Tube Bundles,Condernsers,Cooling Coils,All Pre-Heaters, Large After Coolers and Mechanically Bonded Radiators






GRAND RADIATORS

PLOT NO 131, BLOCK – D, AUTONAGAR,
VISAKHAPATNM -530012.AP, INDIA
TELPHONE: 0891-2517706, 2564538, FAX NO. 0891-2513660, 2502640
E-mail: grandradiator@yahoo.in Website: www.grandradiators.com



**తెనాలి వాస్తవ్యులు శ్రీ చీమకుర్తి శివకుమార్- ఇందిరల**
**వివాహం (10-3-1948) 50 వంసతాలు నిండిన సందర్భంగా, వారిపై**
**శ్రీసద్గురుదేవుల శుభాశీస్సులు సంతతధారగా వర్షించుగాక!**

# కెరటాలకు తలవంచితే తరగదు త్రోవ

- పాలూరి కాళీప్రసాద్

మనం ప్రతిరోజూ ఎన్నో మంచిపనులు చేయాలని అనుకుంటూ వుంటాము. కానీ అవి చేసే సమయం వచ్చేసరికి మాత్రం వేరే వ్యాపకాలలో పడి వాయిదా వేసేస్తూ వుంటాము. పిల్లలు ఏడుస్తున్నారనో, టీ.వీ లో మంచి సినిమా వస్తున్నదనో, రాత్రి సరిగ్గా నిద్ర పోలేదనో ఇలా ఏదో ఒక వంక వెతుక్కుంటూ వుంటాము.

వెనకటికి ఇలాగే ఒకడు సముద్ర స్నానం చేద్దామని వెళ్ళాడట. తీరా అక్కడకి వెళ్ళేసరికి ఒక పెద్ద కెరటం ఎదురైంది. అమ్మో! ఇది పోయాక దిగుదాం నీళ్ళల్లో అనుకున్నాడట. అదిపోతే ఇంకో చిన్న కెరటం. ఇది చిన్నదే కదా ఇది కూడా పోనీ అనుకున్నాడు. అలా ఎంత సేపు కూర్చుంటే మటుకు సముద్రంలో కెరటాలు ఆగుతాయా? వీడు స్నానం చేయగలుగుతాడా?

మన సంసారంలో కూడా యిలా ఒకదాని తరువాత ఒకటి అడ్డంకులు వస్తూనే వుంటాయి. కానీ మనం చేరుకోవలసిన అంతిమ గమ్యాన్ని ఎల్లప్పుడూ దృష్టిలో వుంచుకొని మన ఆధ్యాత్మిక సాధనను పట్టుదలతో కొనసాగించాలి. అప్పుడే, ఈ జన్మలో కాకుంటే మరికొన్ని జన్మలకైనా మోక్షపథాన్ని అందుకోగలుగుతాము.

ఈ కెరటాల గురించి శ్రీ బాబూజీ మహరాజ్ ఇలా చెబుతూ వుండేవారు ...... ఏదైనా పెద్ద కెరటం వచ్చినప్పుడు దాని నుంచి తప్పించు కోవటానికి రెండు ఉపాయాలు - మొదటిది పూర్తిగా నీళ్ళలోకి వంగి పోవటం. ఇలా చేస్తే కెరటం మన పైనుంచి వెళ్ళిపోతుంది. రెండవది కెరటంతో పాటుగా మనం కూడా అంత ఎత్తుకి లేవడం. అప్పుడది మన క్రింద నుంచి వెళ్ళిపోతుంది. ఈ రెండూ చేయకుండా అలాగే మొండితనంగా నిల్చుంటే ఆ కెరటం మనలను పడద్రోసి లోపలకు లాగేస్తుంది.

ఇందులో మొదటిది భక్తి మార్గం - భగవంతునికి సర్వసమర్పణ చేసి, అంతా నీదే భారమని వంగి వుండటం. ఇక రెండవది జ్ఞాన మార్గం - ఈ కష్టసుఖాలు అశాశ్వతమని గుర్తించి వాటికి అతీతంగా మెలగటం.

# జెన్ స్టోరీ

- రమణ ప్రసాద్

జపాన్‌లో పెంపొందింపబడిన 'బుద్ధిజం' 'జెన్'. మనుస్సను ఖాళీగా చేసుకోవటం వలన కలిగే ప్రశాంతత. 'జెన్'ను చైనీస్ భాషలో 'చాన్', సంస్కృతంలో 'ధ్యానం'. అంటే జెన్ మాస్టర్స్ చెప్పిన స్టోరీలు ఆలచనాత్మకంగా ఉన్న కొద్దీ ఆధ్యాత్మిక వికాసాన్ని కలిగిస్తాయి.

ఒక అగంతకుడు ప్రయాణం చేస్తూ ఒక కొత్త ఊరు వస్తున్నాడు. ఆ ఊరు ఎంత దూరంలో ఉందో, ఆ ఊరు ఎలా ఉంటుందో అని ఊహాగానం చేస్తూ వస్తున్నాడు. ఈ వివరాలన్నీ తెలుసుకొనేందుకు ఒక "జెన్ మాస్టర్"ని కలిసి ఇలా అడిగాడు: నేను చేరుకొనే ఊరు నాకు నచ్చుతుందా? అక్కడివారు మంచివారేనా?




జెన్ మాస్టర్ : నువ్వు ఇప్పుడు వస్తున్న ఊరివారు ఎటువంటి వారు?
అగంతకుడు ; వారంతా చెడ్డవారు, లోభులు, సంకుచిత స్వభావం కలవారు, కోపిష్టులు, మోసగాళ్ళు, దొంగలు.
జెన్ మాస్టర్ : ఈ ఊరివారు కూడా సరిగ్గా అలాంటివారే. ఇంతలో ఇంకొకొడు ఆ ఊరికి వస్తూ జెన్ మాస్టర్‌ని కలిసి ఈ ప్రశ్నే అడిగాడు.
జెన్ మాస్టర్ : నువ్వు ఇప్పుడు వస్తున్న ఊరివారు ఎటువంటి వారు?
రెండవవాడు: వారు చాలా మంచివారు. సత్ ప్రవర్తన కలవారు. ఒకరికొకరు సహాయం చేసుకొంటారు. ఉదార స్వభావులు. అందరూ కలిసి మెలిసి ఉంటారు. ఆధ్యాత్మిక దృష్టి ఉన్నవారు.
జెన్ మాస్టర్ : ఈ ఊరివారు కూడా సరిగ్గా అలాంటివారే.

ధర్మరాజుని ఒక చెడ్డ వాడిని వెదికి తెమ్మంటే అతనికి ఎవరూ దొరకలేదు. తను చూసినవారందరూ చాలా మంచివారే. తనలోనే ఎన్నో అవగుణాలు ఉన్నాయి అని తిరిగి వచ్చాడు. దుర్యోధనుడిని ఒక మంచి వాడిని వెదికి తెమ్మంటే తనకు మించిన మంచివాడు ఒకడూ దొరకలేదు. తనంత మంచివాడు ఇంకొకడు లేడని తిరిగి వచ్చాడు. అదే మాట జెన్ మాస్టర్ చెప్పాడు.

# కైవల్యోపనిషత్

- రేఖ

శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో గల శ్రీశుకబ్రహ్మాశ్రమంలో 26-2-2018 నుండి 1-3-2018 వరకు జరిగిన జ్ఞానసదస్సులో శ్రీ మాతాజీవారు కైవల్యోపనిషత్తు గురించి ప్రసంగించారు. దానిని సంక్షిప్త రూపంలో అందిస్తున్నాము ......

"కైవల్యం అంటే మోక్షము. మనమందరం ప్రస్తుత స్థితిని గుర్తిస్తే మోక్షస్థితి, ముక్తస్థితిలోనే వున్నాము. అంటే కైవల్యంలోనే వున్నాము. కేవలం ఏది పొందితే ఇంక ఏదీ పొందవలసినది లేదో అదే కైవల్యం. మోక్షస్థితి చచ్చిపోతే వస్తుందా? ఆలోచిస్తే, మరణించాక పొందేదీ లేదు. చనిపోయిన తరువాత వచ్చేది బూడిద, అస్తికలు మాత్రమే. మరణం రాక ముందే ఆ మోక్షస్థితిని గుర్తించి, అనుభవించాలి.

భగవంతుడు మనకు ఉన్నతమైన మానవ జన్మను ప్రసాదించాడు. మానవ జన్మను పొందితే చాలదు. ఏది పొందితే ఇక పొంద వలసినది లేదో, ఆ స్థితిని గుర్తించటానికి కావలసినది వడ్డించి పెట్టారు మనకు మన మహాత్ములు. వడ్డన అనగానే భోజనం మీదకి పోతుందేమో దృష్టి. ఆ భోజనం మహాతింటే 5 లేదా 10 నిమిషాలు తింటాము. భోజనానికి ముందు వెనుక చేతులు కడుక్కోవాలి. కానీ ప్రస్తుత విషయంలో పంచభూతాలతో పనిలేదు. అసలు పంచభూతాలను మనం ధరించే వున్నాము అన్న దివ్య వైభవాన్ని గుర్తించాలంటే, సర్వకాల సర్వావస్థల యందు మనం మన అంతఃకరణను పవిత్రంగా వుంచుకుంటే చాలు. జన్మజన్మల నుండి వస్తున్న మాలిన్యం అంతా మన అంతఃకరణకు పడుతోంది. ఇదంతా ఎలా వుంటుందంటే విత్తనం ముందా, చెట్టు ముందా అన్నట్లుగా వుంటుంది. అంతఃకరణ ఎప్పుడు పవిత్రత చెందుతుంది? మహాత్ములను ఆశ్రయించి, వారి బోధలను శ్రవణం చేస్తే అంతఃకరణ పవిత్రత చెందుతుంది. అలా అయిన తరువాత కదా మహాత్ములు దొరికేది. దానికే వారు చెప్పారు, ఏమంటే కారు చీకటిగా వున్నది. కరెంటు కూడా పోయింది. కళ్ళు పొడుచుకున్నా కూడా ఏమీ కనబడటం లేదు. అప్పుడు ఏం చేస్తాం? జపమాల పట్టుకుని 'వెలుగు' 'వెలుగు' అని జపం చేస్తే వస్తుందా వెలుగు? ఒక బ్యాటరీలైటో, లేక అగ్గిపుల్లలో వెలిగిస్తే వెంటనే ఆ చీకటి ఆ వెలుగులో లయమై పోతుంది.

ఇంత భయపెట్టిన ఆ చీకటి ఎక్కడ ఉంది అంటూ వెలుగు వెదకటం మొదలు పెడితే, చీకటి ఉంటుందా? వెలుగు లేకపోవటం

వల్లనే చీకటి వచ్చింది. మనలో జ్ఞానం లేకపోవటం వల్లనే అజ్ఞానం వచ్చింది. మనలో జ్ఞానం సర్వవ్యాపకంగా ఉన్నా, అది మరపుకు వచ్చింది. మహాత్ములు ఎంతో త్యాగం చేసి ఆశ్రమాలు నిర్మించి, సేవ చేసుకొని, పరమాత్మ చింతనతో హాయిగా విచారణ చేసుకోండి, ఆనందాన్ని పొందండి అని ప్రబోధిస్తున్నా కూడా జన్మ జన్మాంతరాల వాసనల వల్ల మానవులు ఇంకా ప్రపంచం చుట్టూనే తిరుగుతూ ప్రపంచ వాసనలతో బంధింపబడి పోతున్నారు.

వారు ఏ శక్తితో వీటన్నిటినీ నడిపిస్తున్నారు? వారు అందించినది దేనికి సంబంధించి వున్నది? దేనికోసం మనం వెతుకు తున్నాము? మూలానికి వెళ్ళాలి. జీవితానికి ఏది మూలం? జ్ఞానం. మనం పరిమాణం కూడుకున్న వాటినే సంపాదించుకుంటున్నాము. అవి మన ముందరే నశించిపోతున్నాయి. మహాత్ములు ప్రసాదించే బోధ పరిపూర్ణమైనది. అది చెప్పేది ఏమిటి అంటే 'ఉన్నది ఒక్కటే వస్తువు. నీ వంటూ వేరుగా లేవు. అదే కైవల్యం. అది నీకంటే భిన్నంగా వున్నది అనే భావన నీ మనో ప్రవృత్తి తెచ్చిపెడుతోంది. నీకంటే భిన్నంగా వున్నదనుకోవటమే బాధను తెచ్చి పెడుతోంది కాబట్టి మనఃప్రవృత్తిని మార్చుకోవాలి. ప్రపంచం వైపు నుంచి దృష్టిని మరల్చాలి.

-సశేషం

## వేసవిలో శిక్షణా తరగతులు!

25-4-2018 నుండి 15-5-2018 వరకు శ్రీకాళీగార్డెన్స్ నంబూరులో చిన్నపిల్లలకు వేసవి శిక్షణా తరగతులు ప్రార్థన, భగవద్గీత, ఉపనిషత్తులు మొదలగు అంశాలలో నిర్వహింప బడుతున్నాయి. ఆసక్తి గల తల్లిదండ్రులు విషయాన్ని గమనించి సద్వినియోగ పరచుకోగరు!

వివరములకు డా.అరుణ. సెల్ నం. 9346382563

శుభాభినందనలతో ...


VennTech
Manufacturer of
Ventilation System /
Air Handling Equipments
for Marine applications
PRODUCTS :
Blowers
ATU'S
Coolers
Moisture Separaters
Heat Exchangers
PLOT NO: 1-125/17/A, MIE, HAFEEZPET, MIYAPUR, HYDERABAD – 500 049.
MOBILE: 9000410044, TEL : 040 – 64100589, FAX:040-23116650
E-MAIL: VENNTEC@GMAIL.COM

# సమర్థ సద్గురు నాథుని దివ్య చరిత్ర

## భీమవరం తాతయ్యగారితో శ్రీబాబు

(గత సంచిక తరువాయి) - విజయేశ్వరానంద ప్రసాద్

శ్రీబాబు ఎక్కడికి వెళ్ళినా, తమ కారులో తాతయ్యగారిని, అమ్మమ్మగారిని తమకు చెరొక ప్రక్క కూర్చోబెట్టుకుని తీసుకుని వెళ్ళే వారు. ప్రక్కనే కూర్చున్న తాతయ్యగారిని, అమ్మమ్మగారిని తమ ఒళ్ళో పడేసుకుని పసి పిల్లల్ని ఊపినట్లు ఊపుతూ చక్కిలిగింతలు పెడుతూ నవ్వించే వారు. చిన్నపిల్లలతో ఆడుకున్నట్లు ఆడుకునే వారు. ఇహ ఆ తాతయ్యగారికి ఈ "మనుమని" ఆటలతో నవ్వలేక పొట్ట చెక్కలయ్యేది. బోసి నోటితో ఆయన నవ్వుతున్న కొద్దీ శ్రీబాబు మరింత హుషారు చేసేవారు.



తాతయ్యగారింట్లో ఎన్నెన్నో పండుగలను శ్రీబాబు దివ్య సన్నిధిలో భక్తులందరూ మహదానందంగా జరుపుకొనే వారు. ముఖ్యంగా దీపావళి పండుగ ఒక ప్రత్యేకతను సంతరించు కున్నది. తాతయ్యగారి పెద్దకుమారుడు సుబ్బారావుగారు ఔట్లు మొదలైన ప్రేలుడు సామాన్లు ప్రత్యేకంగా తయారు చేసే వారు. దీపావళి నాటి రాత్రి శ్రీబాబు భక్తులందరితో శ్రీరామాశ్రమంలో కూర్చొని అందరితో టపాకాయలు కాల్పించే వారు. పెద్ద ఔటుపై ఒక పెద్ద బిందెను బోర్లించి, ఔటును పేల్పించే వారు. ఆ బిందె ఎగిరి వెళ్ళి బయట రోడ్డుమీద పడేది. సీమ టపాకాయలు, చిచ్చు బుడ్లు, మతాబులతో ఆ ప్రాంగణమంతా వెలిగిపోయేది. మానవుడు తనలోని సంకల్పాలను, నీచ గుణాలను అలా పేల్చి వేసి దివ్య తేజస్స్వరూపుడై ప్రకాశించాలని శ్రీబాబు అనేవారు. 1961లో భోగి, సంక్రాంతి పండుగలు శ్రీబాబు సన్నిధిలో వారింట్లోనే జరిపారు.

తాతయ్యగారు కుటుంబ సహితంగా ప్రతి సంవత్సరమూ శ్రీ దేవీ శరన్నవరాత్రి పూజలకు, శ్రీ కాళీ జయంతులకు, శ్రీ కృష్ణాష్టమి, శివరాత్రి మొదలైన అన్ని పూజలకు, ఎక్కడ జరిగినా వెళ్ళేవారు. తమ సమయమును శ్రవణ మనన నిదిధ్యాసలతో సద్వినియోగం చేసుకునే వారు. తాతయ్యగారి కుమార్తెలు, కోడళ్ళు ఎంతో సేవ చేసుకునే వారు.

తాతయ్యగారి కోడలు చంపక శ్రీబాబు దేవతార్చనకు , పూజలకు కావలసిన అన్ని ఏర్పాట్లు వేణమ్మతో కలిసి ఎంతో శ్రద్ధా భక్తులతో చేసుకొనేవారు. ప్రతి యేట శ్రీ దేవీ శరన్నవరాత్రి పూజలు ఎక్కడ జరిగినా, పూజల అనంతరం శ్రీబాబు భీమవరం వచ్చి, తమ దేవతార్చన పీఠమును తాతయ్యగారింట్లో ఉంచి కలకత్తా వెళ్లి వచ్చేవారు. తాతయ్యగారి కోడలు సీతమ్మగారు ఆ పీఠము వద్ద నిత్యము దీపారాధన చేసి, పుష్పములుంచి, నివేదన సమర్పించి హారతి యిచ్చేవారు.

శ్రీబాబు తాతయ్యగారిని, అమ్మమ్మగారిని వెంట తీసుకుని వెళ్లి 1966లో చాల మంది భక్తులతో కలిసి ఉత్తర యాత్ర చేశారు. ద్వారకకు భక్తులతో శ్రీబాబు ప్రయాణం చేస్తుండగా తాతయ్యగారి అరచేతిలో పెద్ద కురుపు లేచి చాలా బాధ పెట్టింది. భోపాల్ స్టేషన్‌లో వారిని దింపి, అక్కడ ఒక డాక్టరును వారి చికిత్సకు నియమించి, వారి పెద్ద కుమారుడు సుబ్బారావుగారిని వారికి తోడుంచి, తిరుగు ప్రయాణంలో కలుపుకుంటామని చెప్పి శ్రీబాబు భక్తులతో ముందుకు వెళ్ళిపోయారు. వెడుతూ వెడుతూ శ్రీ బాబు "తాతయ్యా! దిగులు పడకు. నేను అనుక్షణము నిన్ను చూసుకుంటూ ఉంటాను" అని తాతయ్యగారికి చెప్పి వెళ్లారు.

ఆ డాక్టరుకు తెలుగు రాదు. పూర్తిగా క్రొత్తవాడు. ప్రదేశము క్రొత్తది. అయినా ఆ డాక్టరు ఎంతో ఆత్మీయుని వలె రెండు పూటలా వచ్చి తాతయ్యగారి వద్ద కూర్చుని, శ్రద్దగా చికిత్స చేయటమే కాకుండా, కబుర్లు చెబుతూ, తాతయ్యగారికి కొండంత ధైర్యానిస్తూ, శ్రీ బాబు భక్తులతో తిరిగి వచ్చే వరకు, కాలం తెలియకుండా చేశాడు. ఆయన మాట్లాడే తీరును, పలకరింపులోని ఆత్మీయతను గమనించిన తాతయ్యగారికి శ్రీబాబు ఆ రూపంలో ఉండి, తనను కనిపెట్టి రక్షించుకున్నారనే పూర్తి విశ్వాసం కలిగింది. దానికి తోడు, శ్రీ బాబు భక్తులతో తిరిగి వచ్చిన తరువాత ఆ డాక్టరుకు తాతయ్యగారు డబ్బివ్వ బోతే, ఆయన తీసుకోకుండా, శ్రీబాబుకు నమస్కరించి "తమ వంటి మహాత్ముల దర్శనం, యీ తాతయ్యగారి నెపం వల్లనే నాకు లభించింది. ఎన్నో జన్మల పుణ్య ఫలం వలన గాని యిటువంటి భాగ్యం లభించదు. అందుకు నేను ఋణపడి ఉన్నాను. ఇటువంటి సేవా భాగ్యాన్ని పొందుతూ నా వృత్తిని , నా జన్మను సార్ధకం చేసుకొనేటట్లు తమ ఆశీస్సులను ప్రసాదించండి" అని ప్రార్థించాడు.

-సశేషం

# విష్ణు  కధలు

- రమణ ప్రసాద్

## శ్రీరామకృష్ణ పరమహంస

వంగదేశంలో కామార్పుకూర్ అనే గ్రామంలో 1836 ఫిబ్రవరి 18 వతేదీ (ఫాల్గుణ శుక్లద్వితీయ, బుధవారం) శ్రీరామ కృష్ణుడు ఒక పేద కుటుంబంలో జన్మించాడు. అతని తండ్రి పేరు ఖుదీరామ్ చట్టోపాధ్యాయ, తల్లి చంద్రమతీదేవి.



ఖుదీరాముడు దైవభక్తిపరాయణుడు సత్యనిష్ఠాగరిష్టుడు, సుశీల వ్రతుడు సత్యసంధాత అవటం చేత తనకూ తన కుటుంబానికీ ఎన్ని కష్టాలు వాటిల్లినా సత్యవ్రతాన్ని విడిచిపెట్టని సత్యారాధకుడు.

ఒకప్పుడు తన గ్రామ జమీందారు తనకు అనుకూలంగా దొంగ సాక్ష్యం చెప్పమని నిర్బంధిస్తే ఖుదీరామ్ అతడి మాటలను ఒప్పుకోలేదు. దుర్మార్గుడైన ఆ జమిందారు పగబట్టి ఒక అసత్య వ్యాజ్యాన్ని తెచ్చి అతడి పిత్రార్జితాన్నే కాక అతడు నివసిస్తున్న గృహాన్ని కూడా హరించాడు. ఖుదీరాముని సహధర్మచారిణి సుగుణాలరాశి.

శ్రీరామకృష్ణునకు తల్లిదండ్రులు పెట్టిన పేరు గదాధరుడు. జగత్ప్రసిద్ధమైన శ్రీ రామకృష్ణ నామం ఇతడికి గురుదేవులైన తోతాపురి ఇచ్చినట్లు తెలుస్తోంది.

పువ్వుపుట్టగానే పరిమళం అబ్బినట్లు గదాధరుడి భావోన్నత్య సూచనలు బాల్యంలోనే పొడగట్టాయి. బాల సూర్యుని పోలిన అతడి దివ్యమూర్తి, అతడి ప్రేమమయ ప్రవర్తన, జనాన్ని అద్భుతరీతిలో ఆకర్షించసాగాయి. గదాధరుడంటే ఇరుగు పొరుగువారికి అల్లారు ముద్దు. తోటి బాలురకు అతడే నాయకుడు. కళాకౌశలమైన అతడి హృదయం ప్రకృతి సౌందర్యంలో రమించేది. అనుకరణ, హాస్యం, చిత్రలేఖనం, మృణ్మయవిగ్రహ నిర్మాణం, వీధినాటక ప్రదర్శనలు, సంకీర్తన, రామకృష్ణాది పురాణ పురుష ధ్యానం. ఇవి గదాధరుడి బాల్యక్రీడలు.

పాఠశాలలోని విద్యావిధానం అతనిని ఆకర్షించలేదు. పండితులచే జరుపబడే పురాణ పఠనాలు, శాస్త్రవ్యాఖ్యానాలు అతడు ఆలకించి భారత

భాగవతాల గ్రంథసారాన్ని పూర్తిగా గ్రోలాడు.

బడి చదువు అలక్ష్యపరుస్తున్నాడని అన్న రామకుమారుడు అతణ్ణి మందలించగా, "అన్నా? ఈ పొట్టకూటి చదువు నాకెందుకు? ఇందుకు బదులు శాశ్వతానందదాయకం, శ్రేయస్కరం అయిన తత్త్వ జ్ఞానాన్ని ఆర్జించగోర్తాను" అన్నాడు.

పసితనం నుంచి పిరికితనం ఎలాంటిదో అతను ఎరుగడు. దృఢగాత్రుడూ, తేజోనిధీ అయిన అతడు తాను న్యాయమని నమ్మిన విషయాలలో ఒకరి బెదిరింపులను ఏ మాత్రం లెక్కపెట్టేవాడు కాదు. ఘోషా పద్ధతి కేవలం నిరుపయోగం అని నమ్మి తదాచారాన్ని తృణీకరించాడు. ధని అనే కమ్మరి ఇల్లాలుకు చేసిన వాగ్దానం ప్రకారం గదాధరుడు తన ఉపనయన సందర్భంలో ఎవరెంత వద్దని వారించినా ఆమె నుండి తన ప్రధమ బిక్షను స్వీకరించాడు.

ఇతని బాల్యం నుండీ భగవద్భక్తియే అతడి జీవితలతకు ప్రధానాశ్రయమై ఒప్పింది. ఇంట్లో నిత్య దేవతార్చనలోగాని, ఊళ్ళో జరిగే ఈశ్వరసేవల్లోగాని గదాధరుడు అగ్రగణ్యుడై దీపించేవాడు. బైరాగులన్నా, సన్యాసులన్నా అతడికి బాల్యం నుంచీ పరమానందం. అతనిలో భక్తిభావాలు పెంపొంది, ఈశ్వరధ్యాన నిమగ్నుడై, సాక్షాత్కారంలో సంగమించే దివ్యభావాలను అతడు పొందసాగాడు బాల్యజీవితంలో ఇలాంటి మహోత్కృష్ట సంఘటనలలో ప్రధాన మైనవి మూడు–

వర్షాకాల మేఘాలు ఆవృతమైన నల్లని ఆకాశంలో ముత్తెపు సరాన్ని బోలిన తెల్లని కొంగలబారును చూసినప్పుడు ఒకసారి; ఊళ్ళో నాటకంలో శివుని వేషం ధరించినప్పుడు రెండవసారి; తీర్థయాత్ర సమయంలో ఈశ్వర సంకీర్తనం చేసేటప్పుడు మూడవసారి– గదాధరుడు సమాధి స్థితిని అనుభవించాడు. ఆ భక్తి భావాలే అతని పరమాత్మాన్వేషణకు దారి తీశాయి. ఆత్మ సామ్రాజ్యంలో అతడు గడించిన అఖండ విజయాలే మానవకోటికి అతడిని ఆదర్శ పురుషుడుగా, యుగపురుషుడుగా తీర్చి దిద్దాయి.

-సశేషం

Printed, and Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL